జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 5 సంచిక - 11 పక్షపత్రిక జూన్ 1-15, 2014



వెంకయ్యనాయుడు

# కేంద్రంలో తెలుగు మంత్రులు



అశోక్ గజపతిరాజు



నిర్మలా సీతారామన్





హైదరాబాద్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం





జన రాజకీయం కోసం...

లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జూన్ 1-15 2014

సంపుటి - 5 సంచిక - 11

## లోపలి పేజీల్లో...

ప్రగతి సాధానికి ప్రజాస్వామ్యమే పునాది................ 5
తెలంగాణాలో కొలువుదీరిన మంత్రివర్గం................ 8
రాజకీయ అవినీతిని పాతరేస్తా................................ 9

తెలంగాణ కొత్త ప్రభుత్వానికి
నిర్మాణాత్మక సహకారం : జేపీ................................ 11

పోలవరం ఆర్డినెన్స్‌కు రాష్ట్రపతి ఆమోదం............... 12
మొదలైన మోదీ శకం................................................ 13
మే 26న ప్రమాణం చేసిన మోడీ మంత్రివర్గం......... 16
100 రోజుల కార్యాచరణకు మోడీ ఆదేశం............. 17
మోడీ సర్కారు ముందున్న సవాళ్లు........................... 19
నల్లధనం వెలికితీతకు "సిట్" ఏర్పాటు.................... 22
నల్లధనంపై వేగంగా దర్యాప్తు................................ 23
ఆర్థిక రంగాన్ని గాడిలోకి తెస్తా................................ 24
భారత్ సత్తా చాటి చెప్పడమే లక్ష్యం......................... 25
దేశంలో 100 స్మార్ట్ నగరాలు................................ 26
మల్టీబ్రాండ్ రిటైల్‌లో ఎఫ్‌డిఐలను అనుమతించం.. 27
జాతీయ ఆహార భద్రత మిషన్‌లో రాష్ట్రానికి కోత.... 28
రాష్ట్రాలకు రాజ్యసభ సభ్యుల లాటరీ కేటాయింపు. 29
ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో సైకిల్ జోరు........................ 30
తెలంగాణాలో తెరాసకే ఓట్లు... సీట్లు...................... 31
కెమిస్ట్రీ ఆఫ్ టియర్స్............................................. 32
నేటి నినాదం పర్యావరణం.................................... 34

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం
పి. రవిమారుత్
బండారు రామ్మోహన్‌రావు
ఓంకార్
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# తెలుగు ప్రజలు - రెండు రాష్ట్రాలు

## సంపాదకీయం

తెలుగు ప్రజలకు రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. తెలంగాణాలో కొత్త ప్రభుత్వం కొలువుతీరింది. ఆంధ్రప్రదేశ్‌లో మరో ప్రభుత్వం త్వరలో ఏర్పడబోతున్నది.

ఒక పక్క ప్రత్యేక రాష్ట్రం కోసం, మరోపక్క సమైక్యత కోరుతూ ఉద్యమాలు సాగినప్పడు తెలుగు ప్రజల మధ్య ఉద్రేకాలు, ఆవేశాలు, విద్వేషాలు చోటు చేసుకున్న సందర్భాలున్నాయి. వీటి వెనుక తెలుగు ప్రజల ప్రయోజనాలకంటే రాజకీయ ప్రయోజనాలే ప్రధాన పాత్ర పోషించాయి. రెండు రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత ఏ ప్రాంతంలోనూ విద్వేషాలకు తావు ఇవ్వకూడదు. తెలుగు ప్రజలు ఏ రాష్ట్రంలో వున్నా పరస్పర సహకారంతో ఒకటిగా ఎదగాలి. విభజన ప్రక్రియలో అలాంటి సామరస్యం కోసం ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు సంయమనంతో వ్యవహరించాలి. పోలవరం ముంపుగ్రామాలు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్రతిపత్తి వంటి అంగీకృత అంశాలను తిరిగి తవ్వి తలకెత్తుకోకూడదు. నదీజలాలు, ఆర్థిక వనరులు, ఉద్యోగుల పంపిణీ అంశాలను నిర్దిష్ట మార్గదర్శకాల ప్రాతిపదికన సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలి.

ఇప్పడు రెండు ప్రభుత్వాలు ఆయా రాష్ట్రాల సత్వర అభివృద్ధి మీద కేంద్రీకరించాలి. అందులో పోటీపడి రెండు రాష్ట్రాలు భారతదేశంలో అగ్రగామి రాష్ట్రాలు కావాలి. ఈ రెండు రాష్ట్రాల దగ్గర ప్రస్తుతం వనరులు పరిమితంగా వున్నాయి. ప్రజల ఆకాంక్షలు అపరిమితంగా వున్నాయి. వీటిని సమన్వయం చెయ్యడం ఈ ప్రభుత్వాల సమర్థతకు గీటురాయి అవుతుంది.

ఇప్పడు ప్రజలు కోరుకుంటున్నది సుపరిపాలన, ప్రజలకు సేవలు సమర్ధవంతంగా అందించేపాలన, అవినీతి రహిత పాలన ఈ రెండు ప్రభుత్వాల నేతలు అవినీతిని పాతరేస్తామని ప్రకటనలు చేస్తున్నారే తప్ప నిర్దిష్ట చర్యలు ప్రకటించడం లేదు. అవినీతిపరుల భరతం పట్టే లోకాయుక్త చట్టం తేవడం ప్రభుత్వ సేవలు సకాలంలో అందించే సిటిజన్స్ ఛార్టర్లకు చట్టబద్ధత కల్పించడం సమాచార హక్కును చిత్తశుద్ధితో అమలు చెయ్యడం వంటి అంశాలను వారు ప్రస్తావించడం లేదు.

ఇప్పడు ప్రజలు కోరుకుంటున్నది సత్వర అభివృద్ధి; విద్యుత్ సరఫరా, రవాణా తదితర మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణకు తక్షణ చర్యలు అవసరం. వ్యవసాయం, పారిశ్రామిక రంగాల మీద రాయితీలు ప్రకటనలు తప్ప నిజమైన అభివృద్ధి మార్గాలను ఈ నేతలు ప్రకటించడం లేదు.

ఇప్పడు ప్రజలు కోరుకుంటున్నది తాము నివసించే చోట మెరుగైన వసతులు వుండాలని, మంచి ప్రమాణ విద్య, వైద్య సౌకర్యాలు పొందాలని, యువతకు నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు కావాలని, పేదలకు జీవన భద్రత కల్పించాలని కోరుకుంటున్నారు. స్థానిక ప్రభుత్వాల సాధికారత, మానవాభివృద్ధి అంశాల మీద వాగ్దానాలు తప్ప నిర్దిష్ట కార్యచరణ ప్రణాళికను ఈ కొత్త ప్రభుత్వాల నేతలు ప్రకటించడం లేదు.

ఈ కొత్త ప్రభుత్వాల నేతలు వరాల వర్షం కురిపించడం తప్ప పరిమిత వనరులతో, ఆర్థిక క్రమశిక్షణతో అభివృద్ధి సాధించే వ్యూహాలు కనిపించడం లేదు. ఇప్పటికైనా ఈ కొత్తప్రభుత్వాలు వీటి మీద దృష్టి సారిస్తాయని ఆకాంక్షిద్దాం.






# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034*

**ఫోన్ నంబర్లు :**
***040- 23311817, 23311819, 23311820, 23312829***
**ఫ్యాక్స్ : *040-23310612***

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# ప్రగతి సాధానికి ప్రజాస్వామ్యమే పునాది

- డా॥ జయప్రకాష్ నారాయణ్

ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఇక ఇండియా, చైనా శాసిస్తాయని ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఇటీవల ఉద్ఘాటించిన నేపథ్యంలో- ఇరు దేశాల అభివృద్ధిని తులనాత్మకంగా పరిశీలించవలసిన అవసరం ఉంది. ప్రగతిపథంలో చైనా దూసుకెళ్తున్న తీరునుబట్టి - ఆర్థిక రంగంలో తదుపరి ప్రబల శక్తిగా ఆవిర్భవించబోయేది ఆ దేశమేనన్నది నిపుణుల అభిప్రాయం. మరోవైపు వార్షిక వృద్ధి రేటు విషయంలో చైనా తరవాతి స్థానంలో ఉన్న ఇండియా- అభివృద్ధిపరంగా ఆ దేశంతో సరితూగగలదా అనే సందేహం వ్యక్తమవుతోంది. విద్య, ఆరోగ్య పరిరక్షణ, చట్టబద్ధపాలన, పన్ను విభాగాలు- ఈ నాలుగు రంగాల మెరుగుదలకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటే వృద్ధిరేటు విషయంలో భారత్‌అద్భుత ప్రగతి సాధించవచ్చునని, తద్వారా అది చైనాకు దీటుగా రాణించవచ్చునని విశ్లేషిస్తున్న వ్యాసమిది....

వార్షిక వృద్ధి రేటు విషయంలో చైనా తరవాతి స్థానం ఇండియాదే. రాజకీయ పరిస్థితులు గందరగోళంగా ఉన్నా, పాలకులు తాత్కాలిక లబ్ధి చేకూర్చే జనాకర్షక విధానాలకే పెద్దపీట వేస్తున్నా దాదాపు ఏడు శాతం వృద్ధిరేటుతో మనదేశం- పెద్ద ఆర్థిక వ్యవస్థలున్న దేశాల్లో ఒకటైన చైనా తరవాతి స్థానంలో నిలవటం విశేషం. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు అంతర్గతంగా గల బలానికి ఇది నిదర్శనం. భారత్, చైనాల విస్తీర్ణం, దృష్ట్యా- వాటి ప్రగతిని పోల్చి చూడటం అవసరమే. చైనాలో దేశవ్యాప్తంగా భారీయెత్తున మౌలిక సదుపాలను సమకూరుస్తున్న తీరును, ఉత్పాదకతకు దోహద పడేలా షాంఘైలోని చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పెద్దసంఖ్యలో ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న వైనాన్ని గమనిస్తే- ఆర్థికరంగంలో తదుపరి ప్రబల శక్తిగా చైనా అవతరించబోతోందని ఇట్టే చెప్పవచ్చు. ఇండియా విషయానికొస్తే అటువంటి ఆశలకు ఆస్కారం తక్కువే. ఇక్కడి పాలకులు అస్తవ్యస్త విధానాలను అనుసరిస్తుండటం, పట్టణాలు అభివృద్ధికి నోచుకోకపోవడం, అసంఖ్యాక యువజనులకు ఉపాధి అవకాశాలు లేకపోవడం, మౌలిక సౌకర్యాలు కొరవడటం అందుకు ప్రధాన కారణాలు.

**పంథా మారాకే చైనాకు మహర్దశ**

ప్రజాస్వామిక పద్ధతులను అనుసరిస్తుండటంవల్ల మనం వెనుకబడ్డామని, చైనా అభివృద్ధి సాధించిందంటే అందుకు కారణం అది నియంతృత్వ విధానాలను అవలంబించడమేనని చాలా మంది అంటుంటారు. అయితే వీరి వాదనలో నిజమెంత? వాస్తవిక పరిస్థితులను నిశితంగా అధ్యయనంచేస్తే- చైనా అనుసరించిన నియంతృత్వ పంథాయే దశాబ్దాల తరబడి ఆ దేశ అభివృద్ధికి అడ్డంకిగా మారిందని తేట తెల్లమవుతుంది. 'గ్రేట్‌లీప్ ఫార్వర్డ్' (ప్రగతి దిశగా ప్రస్థానం) పేరిట 1950లలో చైనా అనుసరించిన విధానాలు ఆ దేశానికి అరిష్టాన్నే తెచ్చిపెట్టాయి. ఆ విధానాల కారణంగా ఆకలిదప్పులకు తాళలేక రెండుకోట్ల మందికిపైగా ప్రజలు మృత్యువాతపడ్డారు. ఇక 'సాంస్కృతిక విప్లవం' చైనాలో అరాచకానికే దారితీసి, ఆ దేశానికి గల ఘనతరమైన సాంస్కృతిక వారసత్వాన్ని ధ్వంసం చేసింది. విద్య, మేధో సంపదల పరంగ చైనాకు గల పునాదుల్నీ అది పెళ్ళగించింది. మావో హయాములో ప్రజలకు పాఠశాల విద్యావకాశాలు, వైద్య-ఆరోగ్య సేవలు, గ్రామీణ ప్రాంతాలకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాయన్నది నిజమే. అయితే- సద్వివేచనతో, పకడ్బందీగా రూపొందించిన విధానాలే ఆ సత్ఫలితాలు ఒనగూడటానికి కారణం. అంతేతప్ప వాటికి, చైనా అనుసరించిన నియంతృత్వం కారణం కాదు. ఆర్థిక సరళీకృత విధానాలను, మరింత ప్రజాస్వామిక పంథాలను అనుసరించడమే డెంగ్ హయాములో చైనా విజయాలు సాధించడానికి దోహదం చేసింది. ఆర్థిక రంగంలో ప్రత్యామ్నాయాలను ఎంపిక చేసుకునే స్వేచ్ఛను కల్పించడంతోపాటు పోటీతత్వాన్నీ చైనా ప్రోత్సహించింది. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను పెద్దయెత్తున వికేంద్రీకరించింది. స్థానిక సంస్థలు స్వతంత్రంగా వ్యవహరించేందుకు వీలుగా వాటికి స్వయం ప్రతిపత్తిని కల్పించింది. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోకుండా, నిరంకుశంగా వ్యవహరించకుండా- చాలా వరకు ప్రజాస్వామ్య పంథానే చైనా అనుసరిస్తోందనడానికి ఇవన్నీ సూచనలే.

అందువల్ల- భారత్-చైనాల వృద్ధిరేట్లు, వాటి ప్రస్తుత స్థూల దేశీయోత్పత్తి (జి.డి.పి) స్థాయిల మధ్య తేడాకు కారణం భారత్ ప్రజాస్వామ్య విధానాలను, చైనా నియంతృత్వ పంథాను అనుసరించమేననడం సబబు కాదు. ఆర్థిక రంగంలో విజయాలను సాధించడానికి దోహం చేసే రెండు కీలక అంశాలు ఏమిటంటే- విధానాలను చక్కగా రూపొందించడం, మరింత స్వేచ్ఛకు అవకాశం కల్పించడం. ఇండియాలో ప్రజా స్వామిక వ్యవస్థ ఉన్నప్పటికీ- ఇక్కడ నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ కేంద్రీకృతమైంది.

టెలికమ్యూనికేషన్ల రంగంలో చైనా సాధించిన అద్భుత ప్రగతిని చూసి ఒకప్పుడు సంభ్రమాశ్చర్యాలకు లోనైన యావత్ ప్రపంచం ఆ దేశాన్ని ప్రశంసల్లో ముంచెత్తింది. టెలికమ్యూనికేషన్ల రంగంలో ప్రత్యామ్నాయాలను ఎంపిక చేసుకునే స్వేచ్ఛతో పాటు పోటీని అనుమంతించాలని, సాంకేతిక పరిజ్ఞాన విస్తృతికి, పెట్టుబడులు పెట్టడానికి వీలు కల్పించాలని మన దేశ విధాన నిర్ణేతలు నిర్ణయించిన దరిమిలా ఇప్పుడు మనం కూడా ఆ రంగంలో చైనా ప్రగతిలో పోల్చదగిన స్థాయిలో అభివృద్ధిని సాధించగలిగాం. టెలికమ్యూనికేషన్ల రంగంలో అభివృద్ధి విషయంలో ఇరుదేశాల మధ్య తేడాకు ప్రధాన కారణం ఇండియా సరళీకృత విధానాలను ఆలస్యంగా అనుసరించడమే. డెంగ్ హయాములో 1978లోనే చైనా ఈ విషయంలో తన మార్గాన్ని మార్చుకోగా, 1991లో సంక్షోభం తలెత్తే వరకు ఇండియా మిన్నకుంది.

1980ల నుంచి చైనా సగటున తొమ్మితి శాతం వృద్ధిరేటును సాధిస్తుండగా, భారతదేశ వృద్ధిరేటు సగటున ఆరు శాతమే ఉంది. ఈ నేపథ్యంలో – అభివృద్ధి విషయంలో చైనాతో ఇండియా సరితూగగలదా... ఆ దేశాన్ని అధిగమించగలదా... అనే సందేహాలు ఉత్పన్నం కావడం సహజమే. ఈ సందర్భంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్.డి.ఐ), ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక రంగంలో సరళీకృత విధానాలు- ఈ మూడు అంశాలూ ప్రధాన చర్చనీయాంశాలుగా మారాయి. ప్రస్తుతం దేశంలోని రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ప్రైవేటీకరణ, కార్మిక రంగంలో సంస్కరణలు సాధ్యం కావన్నది నిజమే. ఎఫ్.డి.ఐ.లు ఉన్నఫళంగా పెరగబోవన్నదీ వాస్తవమే. విత్తపరమైన లోటు మనల్ని నిరంతరం వెన్నాడుతూనే ఉంది. మౌలిక సదుపాయాల కల్పన రంగంలో పెట్టుబడులు పట్టలేకపోవడంతోపాటు, విద్యుత్ రంగాన్నీ ప్రభుత్వం సమర్థంగా నిర్వహించలేకపోతోంది. ఇవన్నీ దేశాభివృద్ధికి ప్రతిబంధకాలుగా పరిణమించాయి.

విత్తపరంగా, రాజకీయంగా ఇలా అడ్డంకులు ఎదురవుతున్నప్పటికీ తక్కువ ఖర్చుతో, ఎవరికీ ఇబ్బంది కలగని రీతిలో అభివృద్ధి, ప్రక్రియను వేగవంతం చేసేందుకు తగు మార్గాలు లేకపోలేదు. కనీసం నాలుగు రంగాల్లో మెరుగుదలను సాధిస్తే- అది వృద్ధిరేటు విషయంలో అద్భుత ప్రగతి సాధించడానికి దోహదం చేస్తుంది. ఈ పరిష్కార మార్గాలన్నీ రాజకీయంగా సాధ్యమైనవే. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులకు లోబడి అమలుచేయడానికి వీలున్నవే. వృద్ధిరేటు పెరుగుదలకు ఉపకరించడానికి వీలుగా మెరుగుపడాల్సిన నాలుగు రంగాలు ఇవి; విద్య, ఆరోగ్య రక్షణ, చట్టబద్ధపాలన, పన్ను విభాగాలు.

పాఠశాల, విశ్వవిద్యాలయాల స్థాయుల్లో విద్యాసేవలు సక్రమంగా అందేలా చూడాలి. పాఠశాల విద్యకు బడ్జెట్‌లో విధులు పెంచారు. ఇటీవల విధించిన విద్యాసెస్సు అందరికీ ఆమోదయోగ్యంగానే ఉంది. సత్ప్రమాణాలతో కూడిన విద్యకోసం పెద్దయెత్తున డిమాండ్ వినవస్తుండటం ముదావహం. పేదలు సైతం తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్న ఆశతో వారి విద్యకోసం గణనీయంగా ఖర్చు పెట్టడానికి ముందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో- విద్యారంగానికి సంబంధించి అర్థవంతమైన విధానాలను అమలుచేయడం, నిధులు కాకుండా ఇతర వనరులను సమకూర్చడం ద్వారా మానవశక్తిని పెంపొందించవచ్చు. తద్వారా వృద్ధిరేటును కనీసం ఒక శాతం పెంచవచ్చు.

దేశంలో ఆరోగ్య పరిరక్షణ వ్యవస్థ అధ్వానంగా ఉంది. ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలను అందించే విషయంలో ప్రభుత్వం తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడంలేదు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రభుత్వం ఇటీవల కొన్ని చర్యలు తీసుకున్న మాట నిజమే. అయితే- అదనంగా నిధులను కేటాయించడం, మరింత మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించడం వంటి చర్యలు తీసుకున్నంతమాత్రాన పరిస్థితులు మారవు. వ్యాధుల బారినపడే సామాన్య ప్రజలు వాటికి చికిత్స చేయించుకోవడానికి వైద్య సేవల అనిమిత్తం అధిక మొత్తంలో వ్యయం చేయవలసివస్తోంది. తమ ఆదాయంలో అధిక మొత్తాన్ని ఇలా ఆసుపత్రి ఖర్చుల కోసం వెచ్చించవలసిరావడం వారిపై పెనుభారం మోపుతోంది. వారు బీదరికంలో మగ్గుతుండడానికి, అప్పులపాలు కావడానికి, ఉత్పాదకత తగ్గడానికి కారణం ఆ

వ్యాధులూ, ఖర్చులే. ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు సక్రమంగా అందాలంటే ముందుగా ఆసుపత్రుల పనితీరులో సమూల మార్పులు రావాలి. ఆ దిశగా ప్రధానంగా తీసుకోవలసిన చర్యలు ఇవి: ఆసుపత్రుల నిర్వహణను వికేంద్రీకరించాలి. అవి ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చూడాలి. ప్రజారోగ్యానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలను సమన్వయపరచాలి. ప్రజలకు పౌష్టికాహారం, రక్షితనీరు లభించేలా చూడాలి. వీటన్నిటినీ మించి వైద్య ఆరోగ్య సేవలను ఏ విధంగా, ఏ ఆసుపత్రినుంచి తాము పొందాలో ఎంపిక చేసుకునే స్వేచ్ఛనుప్రజలకు కల్పించాలి. వైద్య, ఆరోగ్య సేవల రంగంలో పోటీ తత్వాన్ని ప్రోత్సహించాలి. ప్రజారోగ్యం నిమిత్తం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను స్వల్పమొత్తంలోనే పెంచి ఉండవచ్చు. అయితే ప్రజారోగ్య పరిరక్షణ వ్యవస్థ పనితీరులో సమూల మార్పులు వస్తే– ఆ కొద్దిపాటి నిధుల సాయంతోనే దేశ ప్రజల్లో అత్యధికుల కడగండ్లను మనం తీర్చవచ్చు. తద్వారా వారి ఆదాయం, ఉత్పాదకత శక్తి పెరుగుతుంది. వృద్ధిరేటు గణనీయంగా పెరగడానికీ అది దోహదం చేస్తుంది.

మార్కెట్ ఆర్థిక వ్యవస్థ మనుగడ, అభివృద్ధి సాధన... ప్రధానంగా చట్టబద్ధ పాలనపైనే ఆధారపడి ఉంటాయి. పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చేవారికి ప్రోత్సహించాలంటే– ఎవరి పట్లా పక్షపాతంతో వ్యవహరించకూడదు. స్థలాలకు సంబంధించిన సర్వేలు నిర్దుష్టంగా ఉండాలి. వివాదాలను సత్వరం పరిష్కరించాలి. చట్టాలను ఉల్లంఘించేవారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి. మనదేశంలో స్వతంత్రంగా వ్యవహరించే న్యాయవ్యవస్థ, చట్టాలను అమలుచేసే సంస్థలు ఉన్నాయన్నది వాస్తవమే. అయితే అవి కాలంచెల్లిన విధానాలను అనుసరిస్తుండటంవల్ల ఆశించిన ఫలితాలు దక్కడం లేదు. పర్యవసానంగా నేరగాళ్లు, మాఫియాశక్తులు, గూండాలు వివాదాల పరిష్కార కర్తలుగా అవతారమెత్తుతున్నారు. కిరాయి పుచ్చుకుని మోటు పద్ధతుల్లో వివాదాలను పరిష్కరిస్తున్నారు. భారతదేశంలోని కొన్ని విదేశీ బ్యాంకులు సైతం తమ బకాయిలను తిరిగి రాబట్టుకోవడానికి కిరాయి గూండాలను వినియోగిస్తున్నాయని వినికిడి. ఇటువంటి దారుణ పరిస్థితులు ఆర్థిక కార్యకలాపాలకు, అభివృద్ధికి ప్రతిబంధకంగా తయారవుతాయి. నిజానికి చట్టాల అమలుతీరును, న్యాయప్రక్రియను మెరుగుపరచడానికి ఉపకరించే యంత్రాంగాలు మనకు చాలా ఉన్నాయి. వాటికి అయ్యే వ్యయమూ తక్కువే. రాజకీయంగానూ అవి ఆమోదయోగ్యమైనవే. వాటిని సద్వినియోగం చేసుకుని పరిస్థితులను చక్కదిద్దవచ్చు. తద్వారా– వృద్ధిరేటులో ఏటా కనీసం ఒక్కశాతం పెరుగుదలను మనం సాధించవచ్చు.

పన్ను వసూళ్ల విభాగాలు తమ ఏకపక్ష విధానాలతో, అవినీతి పనులతో దేశంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమల జవసత్వాలను పీల్చి పిప్పిచేస్తున్నాయి. పర్యవసానంగా వస్తూత్పత్తి రంగంలో పోటీతత్వం నీరుగారిపోతోంది. ప్రత్యక్ష పన్నుల విధానం కొంతవరకు మెరుగుపడినప్పటికీ సెంట్రల్ ఎక్సైజ్, సేవా పన్నులు, కస్టమ్స్, రాష్ట్రస్థాయిలో విధించే అమ్మకం పన్నులు వంటివి ఇప్పటికీ వివక్షాపూరితంగానే ఉన్నాయి. ఇది పారిశ్రామికవేత్తల ఉత్సాహంపై నీళ్లు జల్లుతోంది. పారదర్శకంగా, పరిశ్రమలకు ఊతమిచ్చే విధంగా ఉండే విధానాలను అనుసరించడం – ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికే కాక ఆదాయం పెరగడానికీ తోడ్పడుతుంది. డబ్బు వెచ్చించవలసిన అవసరంలేని ఈ విధానాలు వృద్ధిరేటు పెంపొందడానికి దోహదం చేస్తాయి. ఈ నాలుగు రంగాలను మెరుగుపరచడం ద్వారా ఆర్థిక వృద్ధిరేటును మూడు, లేక నాలుగు శాతం పెంచవచ్చు.

### పకడ్బందీ విధానాలు అవసరం

ఈ రంగాల పనితీరు మెరుగుపడితే పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఈ దిశగా మనం ముందడుగు వేయడం కష్టమేమీ కాదు. అయితే అందుకు ప్రభుత్వపరంగా పకడ్బందీ విధానాలు రూపొందాలి. ఈ నాలుగు రంగాలను మెరుగుపరచాలనే విషయంలో ఏకాభిప్రాయం సాధించడానికి, ప్రజాభిప్రాయం కూడగట్టడానికి రాజకీయ స్థాయిలో కృషి జరగాలి. అభివృద్ధి సాధించడానికి స్వేచ్ఛ ఓ సువర్ణ అవకాశమే తప్ప అడ్డంకి కానే కాదు. అందువల్ల–దీర్ఘకాలంలో అభివృద్ధి విషయంలో చైనాను మనం అధిగమించగలం అధిగమించాలి కూడా. అందుకు మనం ముందుగా మన ఇంటిని చక్కదిద్దుకోవాలి.

★★★

**భవిష్యత్ భారతం వ్యాస సంపుటి నుండి**

**జూన్ 6, 2005**

# తెలంగాణాలో కొలువుదీరిన మంత్రివర్గం



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కేసీఆర్



మహమూద్ అలీ | టి.రాజయ్య | నాయిని నర్సింహారెడ్డి | ఈటెల రాజేందర్ | పోచారం శ్రీనివాస్‌రెడ్డి



హరీశ్‌రావు | పద్మారావు | మహేందర్‌రెడ్డి | కె.తారక రామారావు | జోగురామన్న | జగదీష్‌రెడ్డి

తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణస్వీకార కార్యక్రమం రాజ్‌భవన్‌లో జరిగింది. కేసీఆర్‌తో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. తెలంగాణ గవర్నర్ నరసింహన్ కేసీఆర్, మంత్రులతో ప్రమాణం చేయించారు.

## ఇదీ మంత్రివర్గ స్వరూపం

**కె.చంద్రశేఖరరావు:** ముఖ్యమంత్రి, సాధారణ పరిపాలన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖ, విద్యుత్తు, బొగ్గు, మున్సిపల్–పట్టణ వ్యవహారాలు, మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు

**మెహమూద్ అలీ:** ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ, పునరావాసం, యు.ఎల్.సి, స్టాంపులు–రిజిస్ట్రేషన్లు

**టి.రాజయ్య:** ఉప ముఖ్యమంత్రి, వైద్య, ఆరోగ్యశాఖ

**నాయిని నర్సింహారెడ్డి:** హోంశాఖ, జైళ్లు, అగ్నిమాపక, కార్మిక–ఉపాధి కల్పన

**ఈటెల రాజేందర్:** ఆర్థిక–ప్రణాళిక, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు

**టి.హరీశ్‌రావు:** నీటిపారుదల, శాసనసభా వ్యవహారాలు, మార్కెటింగ్

**పోచారం శ్రీనివాసరెడ్డి:** వ్యవసాయం, హార్టికల్చర్, సెరికల్చర్, పశు–పాడి సంవర్ధక శాఖ

**జోగు రామన్న:** అటవీ, పర్యావరణం

**జగదీశ్‌రెడ్డి:** విద్య

**కె.తారకరామారావు:** ఐటి, పంచాయతీరాజ్

**పి.మహేందర్‌రెడ్డి:** రవాణాశాఖ

**పద్మారావు:** ఎక్సైజ్ శాఖ

# రాజకీయ అవినీతిని పాతరేస్తా

## తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో కేసీఆర్ వరాలజల్లు

“రాజకీయ అవినీతిని కూకటి వేళ్లతో పెకలించి వేస్తాం. అవినీతిపరుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. అవినీతికి పాల్పడినవారు ఎంతటివారైనా సరే... కఠినంగా వ్యవహరించి శిక్షిస్తాం. అనుకున్న ప్రగతి సాధించాలంటే రాజకీయ అవినీతిని సమూలంగా నిర్మూలించాల్సిందే” అని తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. తమ ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని చెప్పారు. సంక్షేమ పథకాలన్నీ అవినీతిరహితంగా, పారదర్శకంగా అమలు చేస్తామన్నారు. జూన్2 ఉదయం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన తెలంగాణ అవతరణ వేడుకల్లో కేసీఆర్ ముఖ్యమంత్రిగా తన తొలి సందేశాన్ని వినిపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి కోసం కేంద్రంతోపాటు పొరుగు రాష్ట్రాలతోనూ సత్సంబంధాలు ఏర్పాటు చేసుకుంటామన్నారు. ”తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ శుభ సందర్భంలో సమస్త తెలుగు ప్రజానీకానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు. రాష్ట్రావతరణ ఘట్టం తెలంగాణ ప్రజల పోరాట ఫలితం. అమరుల త్యాగ ఫలం. 1969లో ప్రారంభమైన ఉద్యమం మేధావులు, వివిధ వర్గాలు చేపట్టారు. ఎన్నో మలుపులు తిరిగింది. ఈ దఫా ఉద్యమం స్థిరత్వంతో, స్థిత ప్రజ్ఞతతో గమ్యాన్ని ముద్దాడింది. న్యాయవాదులు, కళాకారులు, మేధావులు, ఉద్యోగులు సమస్త ప్రజానీకం ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రం కలను సాకారం చేసుకుంది. ప్రజలే దీనిని ఆవిష్కరించారు'' అని కేసీఆర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. “తెలంగాణ రాష్ట్రం అభ్యుదయం, అభివృద్ధి, బాగుపై ప్రజలు కోటి ఆశలతో ఉన్నారు.

అందుకు అనుగుణంగానే ప్రజా సమస్యల పరిష్కారమే కేంద్రబిందువుగా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుంది. ప్రభుత్వ పాలన కూడా ఉద్యమ పథంలోనే ఉంటుంది. ఇతర రాష్ట్రాలు చూసి నేర్చుకునేలా, తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి తలమానికమయ్యేలా పాలన అందిస్తాం. ప్రజా కమిటీలను ఏర్పాటు చేస్తాం. మేధావులు, పత్రికా సంపాదకులతో సలహా మండలిని నియమిస్తాం. వారి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం” అని కేసీఆర్ ప్రకటించారు. ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్‌తోపాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల స్థాయిలో వేతనాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. ”దళితులు, గిరిజనులు, బీసీలు, మైనారిటీలకు ఇంతకాలం ఆశించిన స్థాయిలో మేలు జరగలేదు. ఈ వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తాం. వీరి అభివృద్ధికి దోహదపడే పథకాలను అమలు చేసే బాధ్యత నేనే తీసుకుంటున్నా. ఈ శాఖలన్నీ నా పరిధిలోనే ఉంటాయి. ఐదేళ్లలోనే ఈ వర్గాల కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తాం. కేవలం దళితుల కోసమే రూ. 50 వేల కోట్లు ఖర్చు చేస్తాం” అని ప్రకటించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ప్రతి పేద కుటుంబానికి 120 గజాల స్థలంలో రెండు పడకగదులు, వంటగది, హాలు, మరుగుదొడ్డి సౌకర్యం ఉన్న ఇంటిని నిర్మించి ఇస్తామన్నారు.

### లక్షలోపు రైతు రుణాలన్నీ మాఫీ

వ్యవసాయ రంగానికి, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కేసీఆర్ పేర్కొన్నారు. రూ.లక్షలోపు పంట రుణాలన్నీ మాఫీ చేస్తామన్నారు. ప్రపంచంలో విత్తనాలు పండించేందుకు అనువైన మొదటి రెండు ప్రాంతాల్లో తెలంగాణ ఒకటి అని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారని, అందుకే తెలంగాణను ''సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'' గా తీర్చిదిద్దుతామన్నారు. వ్యవసాయ విద్యాలయాలను విస్తృతం చేస్తామన్నారు. వ్యవసాయ పరిశోధనలను మరింత ప్రోత్సహిస్తామని చెప్పారు. ఆధునాతన వ్యవసాయ పద్ధతులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందజేస్తామని హామీనిచ్చారు. 75 శాతం సబ్సిడీతో ప్రతి జిల్లాలో వెయ్యి ఎకరాల్లో “గ్రీన్ హౌస్ టెక్నాలజీ” ని అందుబాటులోకి తెస్తామని చెప్పారు. తెలంగాణ ప్రజలు కలలు కన్నవిధంగా గోదావరి, కృష్ణా జలాలు తెలంగాణ భూములను తడిపి పునీతం కావాలని ఆకాంక్షించారు. అందుకు అనుగుణంగానే తమ ప్రణాళికలు ఉంటాయని, ప్రతి నియోజకవర్గంలోనూ లక్ష ఎకరాలకు సాగు నీరు అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు.

**పరిశ్రమలకు సత్వర అనుమతులు**

దేశంలోని ఫార్మా, పౌల్ట్రీ రంగాల్లో మూడోవంతు తెలంగాణలోనే ఉన్నాయని, ఈ రంగాలు మరింత పురోగమించేలా ప్రోత్సహిస్తామని కేసీఆర్ తెలిపారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగం అశాస్త్రీయంగా ఉందన్నారు. ఈ రంగం సుమారు 15 నుంచి 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. దీనిని సరైన పద్ధతిలో పెట్టి ముందుకు తీసుకెళతామని చెప్పారు. "ఆర్థికాభివృద్ధి కావాలంటే, ఉపాధి అవకాశాలు పెరగాలంటే పెట్టుబడులు, పరిశ్రమలు పెద్ద ఎత్తున రావాలి. అందుకు మంచి పాలసీ ప్రకటిస్తాం. సీఎం కార్యాలయాన్ని అనుసంధానం చేసి సింగిల్‌విండో విధానం ద్వారా అనుమతులు ఇస్తాం. పారిశ్రామిక విధానంపై ఆ వర్గాల సలహాలు తీసుకుంటాం" అని కేసీఆర్ తెలిపారు. తెలంగాణను మూడేళ్లలో మిగులు విద్యుత్ రాష్ట్రంగా మారుస్తామన్నారు.

**అంతర్జాతీయస్థాయిలో నిఘా**

ఐటీఐఆర్‌తో అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని, శాంతిభద్రతల సమస్య లేకపోతేనే కంపెనీలు ఇక్కడకు వస్తాయని కేసీఆర్ తెలిపారు. శాంతిభద్రత పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని, హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయిలో పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామని, సమాచార వ్యవస్థను మెరుగు పరుస్తామని చెప్పారు. కనీసం 6 వేల నుంచి 10 వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలపై యాసిడ్ దాడులు, అఘాయిత్యాలు కలిచి వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఇకనుంచి ఏటా రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా పోలీసులకు ఒక పతకాన్ని అందిస్తామన్నారు. స్పెషల్ పోలీస్, ఏఆర్, సివిల్ పేరిట ఉన్న పోలీసు విభాగాలన్నింటినీ ఒకే గొడుగు కిందికి తీసుకొస్తామని తెలిపారు. పోలీసు శాఖలో వ్యత్యాసాలు, అన్యాయాలను సరిదిద్దుతామన్నారు. పోలీసులకూ వారానికి ఒక రోజు సెలవు ఇస్తామని ప్రకటించారు. ఖాళీలను భర్తీ చేస్తామని హామీనిచ్చారు. పోలీసులకు అదనంగా, అధునాతన వాహనాలను సమకూర్చుతామన్నారు. ట్రాఫిక్ పోలీసులకు మెడికల్ అలవెన్స్ అందజేస్తామని, పని గంటల విధానంలో మార్పులు చేస్తామని, అవసరం మేరకు మరికొందరిని నియమిస్తామని చెప్పారు. పోలీస్ స్టేషన్‌ల నిర్వహణకు అవసరమైన నిధులు సమకూరుస్తామన్నారు.

హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో పేరున్న నగరమని కేసీఆర్ పేర్కొన్నారు. నగరంలోని నిరాశ్రయులు, మురికివాడలలో నివసించే వారందరికీ ఆశ్రయం కల్పిస్తామని, దీనికోసం ఎంత ఖర్చయినా భరిస్తామని తెలిపారు. నగరాన్ని మురికివాడలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రపంచం నివ్వెరపోయేలా... హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని కేసీఆర్ చెప్పారు. "రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా కొన్ని అంశాలను మాత్రమే ప్రస్తావించాను. అసెంబ్లీ సమావేశాల్లో అన్ని వివరాలు వెల్లడిస్తాం. అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు పౌర సమాజం సహకారం కూడా కావాలి. ఇదే ఐకమత్యం, ఉద్యమ స్ఫూర్తితో అభ్యుదయం వైపు పయనించాలి. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం, పొరుగు రాష్ట్రాలతోనూ సత్సంబంధాలు నెలకొల్పుతాం. సర్వే జనా సుఖినోభవంతు. అందరూ సుఖంగా, ఆరోగ్యంగా ఉండాలి. ఎవరూ దుఖ పడవద్దు. జై తెలంగాణ" అంటూ కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు. ▲

## ఇవీ వరాలు...

- ★ ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్.
- ★ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల స్థాయి వేతనాలు.
- ★ ప్రభుత్వ కార్యాలయాల్లో అధునాతన సౌకర్యాలు.
- ★ ఉద్యోగుల సర్వీసు నిబంధనలు సరళీకృతం.
- ★ మెరుగైన వేతనాలతో త్వరలో పీఆర్సీ అమలు.
- ★ ఉద్యోగులందరికీ త్వరలో ఆరోగ్య కార్డులు.
- ★ వృద్ధులు, వితంతువులకు పెన్షన్ రూ. 1000.
- ★ వికలాంగులకు పెన్షన్ రూ. 1500.
- ★ బీడీ కార్మికులకు రూ. 1000 .
- ★ పేదలకు డబుల్ బెడ్‌రూం హౌస్.
- ★ రూ. లక్ష లోపు రైతు రుణాల మాఫీ.
- ★ నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు నీరు

# తెలంగాణ కొత్త ప్రభుత్వానికి నిర్మాణాత్మక సహకారం : జేపీ

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు సందర్భంగా 3.5 కోట్ల తెలంగాణ ప్రజలకు సుఖసంతోషాలను, అభివృద్ధిని ఆకాంక్షిస్తూ లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ శుభాభినందనలు తెలిపారు. తెరాస అధ్యక్షుడు కె. చంద్రశేఖర రావు నేతృత్వంలోని కొత్త ప్రభుత్వానికి నిర్మాణాత్మక సహకారాన్ని అందిస్తామన్నారు.

తమతమ రాష్ట్రాలలోని యువతకు మెరుగైన భవిష్యత్తుని అందించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కలిసిమెలిసి పనిచేయాలని జేపీ కోరారు. పటం మీద ఒక భౌగోళిక విభజన ఏర్పడినంత మాత్రాన తెలుగువారి ఉమ్మడి నాగరికత, సంస్కృతి, భాష, సాహిత్యం, చరిత్ర చెరిగిపోవని అన్నారు.

జూన్ 2 ఇక్కడ లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డా॥ బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలతో నివాళు లర్పించిన అనంతరం జేపీ మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఎగరవేయగా, పార్టీ తెలంగాణ కన్వీనర్ బండారు రామ్మోహనరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

అనంతరం మీడియాతో జేపీ మాట్లాడుతూ... తెలుగు ప్రజల చరిత్రలో తెలంగాణ ఒక నూతనాధ్యాయాన్ని ఆవిష్కరించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వెనక దశాబ్దాలపాటు వందలాదిమంది ప్రజల త్యాగాలు ఉన్నాయన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరం, అనివార్యం అని లోక్‌సత్తా పార్టీ అసెంబ్లీలో నిర్ద్వంద్వంగా ప్రకటించిందని జేపీ గుర్తుచేశారు. దాంతోపాటు ప్రత్యేక ప్రతిపత్తి రాయితీలు, మౌలికవసతులు వంటి ఏర్పాట్ల ద్వారా రెండు రాష్ట్రాల ప్రజల మెరుగైన ఆర్థిక భవిష్యత్తుకి పునాది వేసిన ఘనత కూడా లోక్‌సత్తాదేనన్నారు.

సంక్లిష్ట వైవిధ్యాల మధ్య దేశంలో ఐక్యతను పరిరక్షించిన రాజ్యాంగమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుని కూడా సాకారం చేసిందన్నారు. తాను నిరంతర ఆశావాదినని చెబుతూ, రెండు రాష్ట్రాలూ వచ్చే దశాబ్దకాలంలో దేశంలోనే ఆర్థికప్రగతిలో ముందువరసలో ఉంటాయని జేపీ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలుగు ప్రజల ప్రయోజనాలను పరిరక్షించి పెంపొందించటానికి రెండు రాష్ట్రాల పార్లమెంటు సభ్యులూ కృషి చేయాలన్నారు. రెండు ప్రభుత్వాలూ సామరస్య సుహృద్భావ సంబంధాలను కొనసాగిస్తూ ఆరోగ్యకరమైనరీతిలో పోటీ పడాలన్నారు. 'కన్నుకు కన్ను' విధానాన్నే అనుసరిస్తే ఇద్దరూ గుడ్డివారవుతారని, ఇతర రాష్ట్రాలు ముందుకు దూసుకెళ్లిపోతాయని అన్నారు.

నదీజలాల పంపకాలు, ఆర్థిక వనరులు, ఉద్యోగులు తదితరాంశాల పంపిణీ మీద రెండు రాష్ట్రాల మధ్య తొలుత కొన్ని పొరపొచ్చాలు రావచ్చని, కానీ వాస్తవానికి ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పనిచేసే క్రమంలో రెండు ప్రభుత్వాలూ ఎదుర్కొనే సవాళ్లతో పోలిస్తే అవి చాలా చిన్నవని అన్నారు.

విద్యుత్ సరఫరా, రవాణా వంటి మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల్ని ఆకర్షించటం, ఉత్పత్తిరంగాన్ని పెంచటం, అధికారాన్ని వికేంద్రీకరించటం, మంచి ప్రమాణాల విద్యని, నైపుణ్యాలని యువతకు అందించటం, అధికారాన్ని అంటిపెట్టుకోవటం కోసం తాత్కాలిక తాయిలాలతో మభ్యపెట్టకపోవటం వంటి అంశాల మీద రెండు ప్రభుత్వాలూ దృష్టిపెట్టాలని జేపీ అన్నారు.

లోక్‌సత్తా పార్టీ నేతలు కటారి శ్రీనివాసరావు, పి. రవిమారుత్, పి.ఆర్ రావు, శ్రీమతి కె. గీతామూర్తి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ▲



# 'పోలవరం' ఆర్డినెన్స్‌కు రాష్ట్రపతి ఆమోదం
# ముంపు మండలాలు సీమాంధ్రకు బదిలీ

ఖమ్మం జిల్లాలోని పోలవరం ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో చేర్చడానికి కేంద్ర ప్రభుత్వం పంపిన ఆర్డినెన్స్‌ను రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆమోదించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014కి సవరణ చేస్తూ మోడీ సర్కారు పంపిన ఈ ఆర్డినెన్స్‌పై రాష్ట్రపతి మే28 రాత్రి సంతకం చేశారు. దీంతో ఖమ్మం జిల్లాలోని ఐదు మండలాలు పూర్తిగా, రెండు మండలాలు పాక్షికంగా ఆంధ్రప్రదేశ్‌లో కలవనున్నాయి. మార్చి 1న అప్పటి మన్మోహన్‌సింగ్ సర్కారు ప్రతిపాదించిన సవరణకే మోడీ ప్రభుత్వం ఆమోదం తెలిపి రాష్ట్రపతికి పంపినట్లు తెలిసింది.




**వెసులుబాటు కోసమే..**

పోలవరం ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే ప్రజలకు సహాయ, పునరావాస కార్యక్రమాలను సమర్థంగా చేపట్టడానికే ఖమ్మం జిల్లాలోని మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేయాలని నిర్ణయించినట్లు కేంద్రం చెబుతోంది. తెలంగాణ-భద్రాచలం పట్టణాల మధ్య అనుసంధానానికి అవసరమైన గ్రామాలను మినహాయించి ఐదు మండలాలను పూర్తిగా, రెండు మండలాలను పాక్షికంగా సీమాంధ్రకు బదిలీ చేస్తున్నట్లు పేర్కొంది. "పోలవరం బహుళార్థక సాగునీటి ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే వారికి తగిన సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపట్టడంలో ఆంధ్రప్రదేశ్‌కు తగిన వెసులుబాటు కల్పించడంతో పాటు, పరిపాలనా సౌలభ్యతకు అనువుగా గ్రామాల మధ్య అనుసంధానం కొనసాగించడానికి వీలుగా రెవెన్యూ గ్రామాలకు బదులు మొత్తం మండలాలనే ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేయాలని నిర్ణయించాం. 2005 జూన్ 27న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన సాగునీరు, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ (ఎల్‌ఏ 4 ఆర్‌అండ్‌ఆర్-1) శాఖ జారీ చేసిన 111వ జీఓలోని రెవెన్యూ గ్రామాలను మాత్రమే ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేయాలని ఇదివరకు చట్టంలో చేర్చాం. ఇప్పుడు వాటికి బదులు ఆ రెవెన్యూ గ్రామాలున్న మొత్తం మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేయాలని ప్రతిపాదించాం. దీనివల్ల కుక్కునూరు, వేలేరుపాడు, బూర్గుంపాడు (పినపాక, మోరంపల్లి బంజర, బూర్గుంపాడు, నాగినేనిప్రోలు, కృష్ణసాగర్, టేకులపల్లి, సారపాక, ఇరవెండి, మోతె పట్టినగర్, ఉప్పసాక, నక్రిపేట, సోంపల్లి గ్రామాలు మినహాయించి), చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, భద్రాచలం (భద్రాచలం రెవెన్యూ గ్రామం మినహాయించి) మండలాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బదిలీ అవుతాయి" అని కేబినెట్ నోట్ పేర్కొంది. పైన పేర్కొన్న కొన్ని గ్రామాల గుండా జాతీయ రహదారి 221 వెళుతుందని, తెలంగాణ ప్రాంతానికి భద్రాచలం పట్టణంతో అనుసంధానం కొనసాగించడానికి ఈ గ్రామాలే ముఖ్యమని హోంశాఖ స్పష్టం చేసింది. అందుకే వాటిని మినహాయించినట్లు తెలిపింది. ▲

# మొదలైన మోదీ శకం

- ఎ. కృష్ణారావు

నరేంద్ర మోదీని గుజరాత్‌కు పంపించింది వాజపేయి, అద్వానీలే. మోదీ సంక్షోభంలో చిక్కుకున్నప్పుడల్లా అద్వానీ, వెంకయ్య, సుష్మా, అరుణ్ జైట్లీ ఆయనను కాపాడారు. వాజ్‌పేయిని సైతం ప్రక్కకు పెట్టారు. కేశూభాయి పటేల్, వాఘేలాలను ఎదుర్కొనేందుకు సహాయపడ్డారు. గుజరాత్‌కు వెళ్లి మోదీకి అనుకూలంగా ప్రచారం చేశారు. మోదీ “ఇంతింతై వటుడింతై” అన్నట్లుగా ఎదిగేందుకు ఈ బృందమే కారణం. ఇప్పుడు మోదీ విశ్వరూపం ముందు వారిని వెదుక్కోవడం కష్టం.



కేంద్రంలో అత్యధిక మెజారిటీతో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఒక పరిణామ క్రమం. ఒక కొత్త చరిత్ర. రాబోయే రోజుల్లో అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలకు దారితీసేందుకు అవకాశం ఉన్న వినూత్నఘట్టం. ఇక సర్కార్‌లను కాపాడుకోవడానికి ఎంపీలను కొనుగోలు చేసేందుకు అవకాశం లేదు. పార్లమెంట్ సభ్యులు సభలోనే నోట్లకట్టలను ప్రదర్శించే ఘట్టం పునరావృతం కాదు. ప్రజల భవిష్యత్తుపై ప్రభావం చూపే ఎటువంటి విధాన నిర్ణయాలనైనా తీసుకునేందుకు వెనుకాడవలసిన అవసరంలేదు. ఇది కాంగ్రెస్ వ్యతిరేక ఓటు కాదు. కాంగ్రెస్ వ్యతిరేక ఓటు అయితే బీజేపీకి మెజారిటీ సీట్లు లభించే అవకాశం లేదు. ఇది పూర్తిగా బీజేపీకి అనుకూల వోటు. అని నరేంద్రమోదీ తనను పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నుకున్న వెంటనే స్పష్టం చేశారు.

మోదీకి చాలా మంది వ్యతిరేకులు ఉండవచ్చు. బీజేపీకి కేవలం 31 శాతం ఓట్లు వచ్చాయని మిగతా 69 శాతం అంతా మోదీకి వ్యతిరేకులని తృప్తి చెందవచ్చు. మోదీకి మద్దతునిచ్చేవారిని దూరం పెట్టి వారితో మాట్లాడబోమని ప్రకటించి వికార ఆనందం పొందవచ్చు. కానీ కేవలం మోదీని ద్వేషించినంత మాత్రాన జరిగిన పరిణామాన్ని తుడిచిపెట్టడం అసాధ్యం. ఎన్ని ఓట్లు వచ్చాయన్నది ప్రధానం కాదు, ఎన్ని సీట్లు వచ్చాయన్నది ప్రధానం. ఆ సీట్లతో మోదీ తాను చేయగలిగినన్ని పనులు చేయగలరా అన్నది ప్రధానం. మోదీకి అనుకూలంగా ఓటు వేయనంత మాత్రాన వారంతా మోదీని వ్యతిరేకిస్తున్నట్లు భావించడం కూడా కుతార్కికం. కేవలం 200 ప్లస్ సీట్లను సాధించిన కాంగ్రెస్ పార్టీ ఈ దేశంలో చేయగలిగినన్ని అరాచకాల్ని చేసింది. అన్ని వ్యవస్థల్ని కుప్పకూల్చింది. భారీ ఎత్తున అవినీతి కుంభకోణాలకు పాల్పడింది. ఎదురుతిరిగిన వారిని అణిచేసే ప్రయత్నం చేసింది. విచ్ఛిన్నకర చర్యలకు పూనుకుంది. ఏమి చేసినా అన్నిటికీ తల ఊపే ఒక అసమర్థుడితో పాలన చేయించింది. మాట్లాడడం కూడా రాని ఒక అర్భకుడిని దేశంపైకి రుద్దాలని ప్రయత్నించింది. ఎమర్జెన్సీ, ఆపరేషన్ బ్లూస్టార్, సిక్కుల ఊచకోత, శ్రీలంకలో తమిళుల ఊచకోత, పలు మతకల్లోలాల ద్వారా జీవన విధ్వంసానికి కారణమైంది. ఆదివాసీ మహిళలపై అత్యాచారాలను సమర్థించింది. గిరిజనుల జీవితాల్లో కల్లోలం సృష్టించింది. ఒకటా, రెండా కాంగ్రెస్ సర్కార్లు చేసిన

అరాచకాలు? నరేంద్రమోదీని కాదనడం ద్వారా, ఆయనను వ్యతిరేకించడం ద్వారా, ఆయనను అడ్డుకోవడానికి ఒడ్డున నిలబడి ప్రవచనాలు చెప్పడం ద్వారా ఎవరైనా ఏమి సాధించాలనుకున్నారు? మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వారికి సంతోషం కలిగేదా? పోనీ ఈ పరిణామం రాకుండా వారేమైనా ప్రజల్లో చైతన్యం తెచ్చారా? కోట్లాది ఓటర్లు ఒప్పుకునే ప్రత్యామ్నాయం ఏమైనా చూపించారా? వైఫల్యానికి ద్వేషం జవాబు కాదు.

**ఏమి ఫలితాలివి?** ఎన్నికలకుముందు పలు పత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో నరేంద్రమోదీ, అమిత్ షాలిద్దరూ సునామీ వీస్తుందని చెప్పారు. బీజేపీ స్వంతంగా మెజారిటీ సాధిస్తుందని, ఎన్డీఏకు 300 సీట్లకు పైగా వస్తాయని ప్రకటించారు. అలాగే జరిగింది. ఉత్తరాదిన ఒక రకంగా సునామీయే. దాదాపు 200 సీట్లు ఉత్తరాది నుంచే లభించాయి. విచిత్రమేమంటే బీసీలు, మైనారిటీల ఓట్లను నమ్ముకున్న సమాజ్‌వాది పార్టీ, దళితులు, బ్రాహ్మణులను నమ్ముకున్న మాయావతిపార్టీ దాదాపు తుడిచిపెట్టుకుపోయాయి. ఉత్తరప్రదేశ్‌లో దాదాపు 42శాతం ఓట్లు బీజేపీకి లభిస్తే బీఎస్పీ, ఎస్పీ కలిసి దాదాపు చెరి 20శాతం ఓట్లు సంపాదించుకున్నాయి. బీహార్‌లో కూడా 30శాతం ఓట్లు బీజేపీవే. ఈ ఓట్ల శాతాన్ని బట్టి చూస్తే కుల సమీకరణలకు అతీతంగా బీజేపీకి ఓట్లు లభించాయని అర్థం. నిజానికి బీజేపీ పునాది కుల రాజకీయాలను వ్యతిరేకించడం ద్వారా పడింది. బీజేపీకి మతమే కులం. గుజరాత్‌లో రిజర్వేషన్లను వ్యతిరేకించడం ద్వారానే బీజేపీ ఆ రాష్ట్రంలో నిలదొక్కుకుంది. మండల్ కమిషన్ సిఫారసుల అమలుకు వ్యతిరేకంగానే అద్వానీ రథయాత్ర చేపట్టారు. ఆ తర్వాతే బీజేపీ బలం 2 నుంచి 85 సీట్లకు పెరిగింది. పాశ్వాన్‌తోను, అప్నాదళ్ వంటి పార్టీలతో చేతులు కలపడం ద్వారా చిన్నా చితక కుల సమీకరణలు బీజేపీ కూడా ఈ ఎన్నికల్లో చేసినప్పటికీ దేశవ్యాప్తంగా ఇప్పుడు నరేంద్రమోదీకి వచ్చిన ఓటు కుల సమీకరణలకు అతీతమైనది. కులాల, వర్గాల పరిధులను దాటి మోదీ ప్రభంజనం చొచ్చుకుపోయింది. అందుకే బీఎస్పీ ఉత్తరప్రదేశ్‌లో ఒక్కసీటు కూడా సాధించలేకపోయింది. ఒకప్పుడు మాయావతితో చేతులు కలపడం ద్వారా తన బలాన్ని పెంచుకున్న బీజేపీ ఇప్పుడు ఆమెనే దెబ్బతీయగల స్థాయికి చేరుకుంది. నిజానికి ఇలాంటి వ్యూహాలను బీజేపీ తాను బలంగా లేని అనేక రాష్ట్రాల్లో అవలంబించి చివరకు స్వంతంగా అధిక సీట్లు సంపాదించుకోగల స్థితికి చేరుకుంది.

బీహార్‌లో జనతాదళ్ (యు) కూడా ఇప్పుడు బీఎస్పీ మాదిరే తీవ్రమైన సంక్షోభంలో పడింది. ఒడిషా ప్రాంతీయ పార్టీ అయిన బిజూ జనతాదళ్‌ను మినహాయిస్తే విచిత్రమేమంటే ఒకప్పుడు దేశంలో ప్రభుత్వాన్ని ఏలిన జనతాదళ్ ఇపుడే పరిస్థితిలో ఉన్నది? కర్ణాటకలో జనతాదళ్(ఎస్) రెండు సీట్లు గెలుచుకుంటే, బీహార్‌లో జనతాదళ్ (యు) రెండు సీట్లను గెలుచుకుంది. ఈ పార్టీలు ఆయా రాష్ట్రాలలో ఏదో ఒక సమయంలో అధికారంలో ఉన్న పార్టీలు. ఇక దేశంలో వామపక్షాల స్థితి ఏమిటి? మొత్తం పది సీట్లు. పశ్చిమబెంగాల్ రాష్ట్రాన్ని ఏలిన సీపీఐ(ఎం)కు రెండు సీట్లు లభించాయి. అక్కడ నాలుగు సీట్లు సాధించిన కాంగ్రెసే నయం. ఇవి దేశంలో వామపక్షఐక్యత గురించి మాట్లాడుతూనే తమను తాము ఓడించుకునే ప్రయత్నాలు చేస్తుంటాయి. అంటే కుల రాజకీయాలను, వామపక్ష రాజకీయాలను ప్రజలు వదిలించుకునే క్రమంలో ఉన్నారా? మోదీ అన్నట్లు ఇదికేవలం కాంగ్రెస్ వ్యతిరేకత మాత్రమే కాదు. సిద్ధాంతాలను మాట్లాడుతూనే ప్రత్యామ్నాయ వ్యవస్థను ప్రజలకు చూపలేని అరాచక పార్టీల పట్ల వ్యతిరేకత. ములాయం, మాయావతి, లాలూప్రసాద్‌యాదవ్ వంటి నేతల కుల రాజకీయాలకు కాలం చెల్లుతున్నదనడానికి సంకేతం. ఈ కులరాజకీయాల వల్ల దళితులకు, వెనుకబడిన వర్గాలకు ఏమైనా ప్రయోజనం చేకూరిందా అన్న ప్రశ్నలు ఆయా వర్గాలే వేసుకున్నట్లు కనపడ్డాయా అన్నట్లుగా ఈ ఎన్నికలు జరిగాయి. ఒక వ్యక్తికి అనుకూలంగా వచ్చిన ప్రభంజనం ఇన్ని పరిధులను చెరిపివేయడం అంటే సామాన్యం కాదు. అంటే కులసమీకరణలు భవిష్యత్తులో పనిచేయవని అర్థం కాదు. కానీ మోదీ ప్రభంజనం ఏ సమీకరణలనూ పనిచేయని స్థితికి నెట్టివేసింది. పోనీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆరోపించినట్లు మత ప్రాతిపదికగా మోదీ సమాజాన్ని విడదీశారా? హిందువుల ఓట్లన్నీ మోదీకే వచ్చాయా అన్న ప్రశ్నకు కూడా ఆస్కారం లేదు. అలా ఒప్పుకుంటే కులతత్వాన్ని మతతత్వం చెరిపివేసిందని ఒప్పుకోవాలి.

ముజఫర్‌నగర్‌లో అల్లర్లు జరిగాక ఆ ప్రాంతంలో ఓటర్లు ఇరు వర్గాలుగా విభజనకు గురి అయి ఉండవచ్చు. కానీ దేశ వ్యాప్తంగా ఒకే ధోరణి కనపడుతున్నదంటే మతప్రాతిపదిక ప్రభావమే పూర్తిగా మోదీ విజయానికి కారణం కాకపోవచ్చు. మోదీ విషయంలో భారీ మార్కెటింగ్ జరిగి ఉండవచ్చు. మీడియా ఆయనను సమర్థించి ఉండవచ్చు. కాంగ్రెస్‌కు కూడా మార్కెటింగ్ వనరులకు కొరత లేదు. అయినప్పటికీ అనేక ఇతర పార్టీలకంటే

మోదీ ఆధ్వర్యం వహిస్తున్న బీజేపీలో ప్రత్యేకత ఏమిటో ఓటర్లు చూసి ఉండాలి. ఆయనకు అధికారం అప్పజెబితే ఏదో మార్పువస్తుందని వారు భావించి ఉండాలి. ముఖ్యంగా యువత, మధ్యతరగతి తమ జీవిత సమస్యలకు మోదీయే పరిష్కారమన్నట్లుగా భావించారు. మోదీ కుల పార్టీలను, వామపక్షాలను దెబ్బతీశారు కానీ ప్రాంతీయ పార్టీలను పూర్తిగా దెబ్బతీయలేకపోయారు. తెలంగాణలో టీఆర్ఎస్‌ను, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశంను, ఒడిషాలో బిజూజనతాదళ్‌ను, తమిళనాడులో అన్నాడీఎంకేను, పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌ను గెలిపించి ప్రజలు ప్రాంతీయ పార్టీల పట్ల తమ విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. మొత్తం లోక్‌సభలో ప్రాంతీయ పార్టీలకు వచ్చిన సీట్లు దాదాపు నాలుగోవంతు ఉంటాయి. ఈ ప్రాంతీయ పార్టీలు స్థానిక ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబాలు.

ఎవరెన్ని అన్నా బీజేపీ సంపూర్ణ మెజారిటీ సాధించింది. అయినప్పటికీ తాము తమతో ఉన్న ఎన్డీఏలో పార్టీలతో స్నేహపూర్వకంగానే వ్యవహరిస్తామని మోదీ ప్రకటించారు. అదేసమయంలో కనీస ఉమ్మడి కార్యక్రమం అంటూ ఏమీ లేదని స్పష్టం చేశారు.

రాజ్యసభలో బీజేపీకి మెజారిటీ రావడానికి ఇంకా సమయం ఉన్నది. పూర్తి మెజారిటీ వచ్చినందువల్ల బీజేపీ, దానివెనుక ఉన్న ఆర్ఎస్ఎస్ తమ సిద్ధాంతాల వ్యాప్తిని వేగవంతం చేయడానికి ఉబలాటపడవచ్చు. కానీ మోదీ ముందుగా పాలనమీద దృష్టి కేంద్రీకరించి, ప్రజల్లో నమ్మకం కుదిర్చిన తర్వాతే ఇతర అంశాలను పట్టించుకునే ఆస్కారం ఉన్నది. మోదీ పట్ల భ్రమలు తొలగిపోయేందుకు ఆస్కారం ఇస్తారా అన్న దానిపైనే ఇతర పార్టీల మనుగడ ఆధారపడి ఉన్నది.

ఎన్డీఏలోని ఇతర పార్టీలకైనా, బీజేపీలో సీనియర్లకైనా నరేంద్రమోదీని ఆమోదించడం కన్నా వేరే మార్గం లేదు. ఎందుకంటే మోదీ సృష్టించిన ఊపు వల్లే ఈ ఫలితాలు లభించాయి. బీజేపీలో అద్వానీ నేత తొలుత మోదీ నేతృత్వం పట్ల అభ్యంతరం వ్యక్తపరిచినప్పటికీ ఇప్పుడు ఫలితాల తర్వాత సంతోషం పట్టలేకపోయారు. ▲

# వ్యవసాయానికి ఈ ఏడాది రూ.82,519 కోట్లు



పంట రుణాల రీషెడ్యూల్‌కు సర్కారు కృషి చేస్తోంది. ఇది అమలైతే ప్రస్తుతానికి సమస్యలు లేకుండా రైతులు బ్యాంకుల నుంచి వెంటనే రుణాలను అందుకోవటానికి సౌలభ్యం ఏర్పడుతుంది. రాష్ట్రంలో 2013-14లో కరవుకు 119 మండలాలు, ఫైలిన్‌కు 801 మండలాల్లోని రైతులు విలవిల్లాడారు. ఈ కారణంగా 2013-14లో ఇచ్చిన పంట రుణాలను రీ షెడ్యూల్ (దీర్ఘ కాలిక రుణాలుగా మార్పు) చేయటానికి గడువు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మహంతి రిజర్వు బ్యాంకుకు ఒక లేఖ రాశారు. రుణాలను రీ షెడ్యూల్ చేసేటప్పుడు అటువంటి కసరత్తును సమస్యగా చూపించి ఖరీఫ్ రుణాల పంపిణీకి ఆలస్యం కాకుండా చూడాలని ఆర్‌బీఐని కోరారు. ఈ విషయాన్ని ఆయన హైదరాబాద్‌లో ఎస్ఎల్‌బీసీ సమావేశంలో వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2014-15లో వ్యవసాయ రంగానికి బ్యాంకులు రూ. 82,519 కోట్లను రుణాలుగా ఇవ్వదలచినట్లు ఎస్ఎల్‌బీసీ అధ్యక్షుడు, ఆంధ్రాబ్యాంకు ఛైర్మన్ సీవీఆర్ రాజేంద్రన్ వెల్లడించారు. ఇవి గతఆర్థికసంవత్సరంలో ఇచ్చిన దానికంటే రూ. 12,025 కోట్లు ఎక్కువ. వివిధ కారణాల వల్ల పూర్తిస్థాయి రుణ ప్రణాళిక రూపకల్పన ఆలస్యమైందని రాజేంద్రన్ వెల్లడించారు.

# మే 26న ప్రమాణం చేసిన మోడీ మంత్రివర్గం

## కేంద్ర మంత్రివర్గ స్వరూపం

నరేంద్ర మోడీ – ప్రధానమంత్రి: సిబ్బంది వ్యవహారాలు, ప్రజాఫిర్యాదులు, పింఛన్లు, అణు ఇంధనం, అంతరిక్షం, అన్ని ముఖ్య విధానపర నిర్ణయ అంశాలు, మంత్రులకు కేటాయించని ఇతరత్రా అన్ని శాఖలు

### కేబినెట్ మంత్రులు

| | | |
|---|---|---|
| 1. రాజ్‌నాథ్‌సింగ్ | - | హోం వ్యవహారాలు |
| 2. సుష్మాస్వరాజ్ | - | విదేశాంగం, ప్రవాస భారతీయుల వ్యవహారాలు |
| 3. అరుణ్‌జైట్లీ | - | ఆర్థికం, కార్పొరేట్ వ్యవహారాలు, రక్షణ |
| 4. ఎం.వెంకయ్యనాయుడు | - | పట్టణాభివృద్ధి, గృహనిర్మాణం-పట్టణ దారిద్ర్య నిర్మూలన, పార్లమెంటరీ వ్యవహారాలు |
| 5. నితిన్ జయరాం గడ్కరీ | - | రహదారి రవాణా, జాతీయ రహదారులు, నౌకాయానం |
| 6. డీవీ సదానందగౌడ | - | రైల్వే |
| 7. ఉమాభారతి | - | జలవనరులు, నదుల అభివృద్ధి, గంగా పునరుద్ధరణ |
| 8. నజ్మా ఎ.హెప్తుల్లా | - | మైనార్టీ వ్యవహారాలు |
| 9. గోపీనాథ్ రావ్ ముండే | - | గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, తాగునీరు, పారిశుద్ధ్యం |
| 10. రాంవిలాస్‌పాశ్వాన్ | - | వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ |
| 11. కల్‌రాజ్‌మిశ్రా | - | సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు |
| 12. మేనకాసంజయ్‌గాంధీ | .- | స్త్రీ, శిశుసంక్షేమం |
| 13. అనంతకుమార్ | - | రసాయనాలు, ఎరువులు |
| 14. రవిశంకర్‌ప్రసాద్ | - | కమ్యూనికేషన్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, లా అండ్ జస్టిస్ |
| 15. అశోక్‌గజపతిరాజు పూసపాటి | - | పౌర విమానయానం |
| 16. అనంత్ గీతే | - | భారీ పరిశ్రమలు, ప్రభుత్వరంగ సంస్థలు |
| 17. హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ | - | ఆహారశుద్ధి పరిశ్రమలు |
| 18. నరేంద్రసింగ్ థోమర్ | - | గనులు, ఉక్కు, కార్మిక, ఉపాధి |
| 19. జుయల్ ఓరం | - | గిరిజన వ్యవహారాలు |
| 20. రాధామోహన్‌సింగ్ | - | వ్యవసాయం |
| 21. తావర్‌చంద్ గెహ్లోత్ | - | సామాజిక న్యాయం, సాధికారత |
| 22. స్మృతి జుబిన్ ఇరాని | - | మానవ వనరుల అభివృద్ధి |
| 23. హర్షవర్ధన్ | - | ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం |

### సహాయం-స్వతంత్రహోదా

| | | |
|---|---|---|
| 1. జనరల్ వీకే సింగ్ | - | ఈశాన్యరాష్ట్రాల అభివృద్ధి (స్వతంత్రహోదా), విదేశాంగం, ప్రవాస భారతీయుల వ్యవహారాలు |
| 2. రావ్ ఇందర్‌జిత్‌సింగ్ | - | ప్రణాళిక, గణాంకాలు, కార్యక్రమాల అమలు (స్వతంత్రహోదా), రక్షణశాఖ |
| 3. సంతోష్ గంగ్వార్ | - | జౌళి (స్వతంత్రహోదా), పార్లమెంటరీ వ్యవహారాలు, జలవనరులు, నదుల అభివృద్ధి, గంగా పునరుద్ధరణ |
| 4. శ్రీపాద యశోనాయక్ | - | సాంస్కృతికం, పర్యాటకం (స్వతంత్రహోదా) |
| 5. ధర్మేంద్రప్రదాన్ | - | పెట్రోలియం, సహయవాయువులు (స్వతంత్రహోదా) |
| 6. శర్బానంద సోనోవాల్ | - | నైపుణ్యాభివృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్ షిప్, యువజన వ్యవహారాలు, క్రీడలు (స్వతంత్రహోదా) |
| 7. ప్రకాశ్ జవదేకర్ | - | సమాచార-ప్రసారాలు, పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పు (స్వతంత్రహోదా), పార్లమెంటరీ వ్యవహారాలు |
| 8. పీయుష్‌గోయల్ | - | విద్యుత్తు, బొగ్గు, నూతన, సంప్రదాయేతర ఇంధనం (స్వతంత్రహోదా) |
| 9. జితేందర్‌సింగ్ | - | శాస్త్ర-సాంకేతికం(స్వతంత్ర హోదా), భౌగోళిక శాస్త్రాలు (స్వతంత్ర హోదా), పీఎంఓ, సిబ్బంది, ప్రజాఫిర్యాదులు, పింఛన్లు, అణు ఇంధనం, అంతరిక్ష వ్యవహారాలు |
| 10. నిర్మలా సీతారామన్ | - | వాణిజ్యం-పరిశ్రమలు (స్వతంత్ర హోదా), ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాలు |

### సహాయమంత్రులు

| | | |
|---|---|---|
| 11. జీఎం సిద్దేశ్వర | - | పౌరవిమానయానం |
| 12. మనోజ్‌సిన్హా | - | రైల్వే |
| 13. నిహాల్‌చంద్ | - | రసాయనాలు, ఎరువులు |
| 14. ఉపేంద్ర కుష్వాహా | - | గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, తాగునీరు, పారిశుద్ధ్యం |
| 15. పొన్ రాధాకృష్ణన్ | - | భారీపరిశ్రమలు, ప్రభుత్వరంగ సంస్థలు |
| 16. కిరణ్ రిజిజు | - | హోం |
| 17. క్రిషన్‌పాల్ | - | రహదారి రవాణా, జాతీయ రహదారులు, నౌకాయానం |
| 18. సంజీవ్‌కుమార్ బాల్‌యాన్ | - | వ్యవసాయం, ఆహారశుద్ధిపరిశ్రమలు |
| 19. మన్‌సుఖ్‌భాయ్ ధాన్‌జీభాయ్ వసావా | - | గిరిజన వ్యవహారాలు |
| 20. రావ్‌సాహెబ్ దాదారావ్ దాన్వే | - | వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ |
| 21. విష్ణు దేవ్ సాయ్ | - | గనులు, ఉక్కు, కార్మిక, ఉపాధి |
| 22. సుదర్శన్ భగత్ | - | సామాజిక న్యాయం, సాధికారత |

# 100 రోజుల కార్యాచరణకు మోడీ ఆదేశం

- సిద్ధం చేయాలని మంత్రులకు ప్రధాని మోడీ ఆదేశం
- రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టీకరణ
- జూన్ 4-11 మధ్య లోక్‌సభ సమావేశాలు
- 6న స్పీకర్ ఎన్నిక
- 9న ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయం

వచ్చీ రావడంతోనే ప్రధాని నరేంద్రమోడీ సుపరిపాలన దిశగా కసరత్తు మొదలు పెట్టేశారు. సమర్థ పరిపాలన, కార్యక్రమాల అమలుపై దృష్టి పెడుతూ వంద రోజుల కార్యాచరణ సిద్ధం చేయాలని మంత్రివర్గ సహచరులకు సూచించారు. దేశాభివృద్ధికి రాష్ట్రాల పురోగతి కీలకమని మోడీ విశ్వసిస్తూ రాష్ట్రప్రభుత్వాలు, ఎంపీలు లేవనెత్తే సమస్యలకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. మే29న మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. పెట్టుబడుల పెంపు, నిర్ధారిత గడువులోపు మౌలిక వసతుల ప్రాజెక్టులను పూర్తి చేయడం, దేశ ప్రయోజనాల కోసం సహజవనరులను ఉపయోగించుకోవడం వంటి 10 సూత్రాల విజన్‌ను రూపొందించుకున్న మోడీ.. అందులో భాగంగా ఏమేం చేయాలో మంత్రులతో చర్చించారు. తన ప్రాధాన్యతలపై దేశవ్యాప్తంగా సందేశాన్ని ఇవ్వడానికి పార్లమెంట్ సమావేశాల అనంతరం ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం ఉంది. మే29న ప్రధాని కార్యాలయమంతా ఒకసారి తిరిగిన మోడీ.. అక్కడ వివిధ సెక్షన్ల పని తీరు గురించి వాకబు చేశారు. సిబ్బంది సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. మంత్రివర్గ భేటీ వివరాలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి వెంకయ్య నాయుడు విలేకర్లకు వివరించారు. "మే 29 నాటి మంత్రివర్గ సమావేశంలో ఆయా శాఖల మంత్రుల నుంచి ప్రధానమంత్రి మోడీ సూచనలు, సలహాలు తీసుకున్నారు. అందరి మాటలు విన్న తర్వాత ప్రధాని స్పందిస్తూ సుపరిపాలనకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కేంద్రానికి వచ్చే విజ్ఞాపనలు, లేఖలకు తక్షణం స్పందించి తగిన విధంగా స్పందించాలని చెప్పారు. సమాఖ్యవ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటికీ భాగస్వామ్యం ఉంటుందన్న విషయాన్ని మరిచిపోకూడదని ఉద్బోధించారు. అలాగే ప్రజా ఫిర్యాదులపైకూడా దృష్టిసారించాలని కోరారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో పడిన పనులనూ ప్రాధన్యతాక్రమంలో పరిష్కరించాలి అని సూచించారు. ఇదే సందర్భంగా మంత్రులు, కార్యదర్శులతో మాట్లాడతానని ప్రధాని చెప్పారు. సహాయమంత్రులందర్నీ విశ్వాసంలోకి తీసుకొని వారికి తగినపని కేటాయించాలని కేబినెట్ సహచరులకు సూచించార"ని వెంకయ్యనాయుడు వెల్లడించారు.



**ప్రతిపక్ష హోదాపై సంప్రదాయాలను పరిశీలిస్తాం-వెంకయ్య నాయుడు:** 16వ లోక్‌సభ తొలి సమావేశాలు జూన్ 4 నుంచి 11వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రధానమంత్రి మోడీ నేతృత్వంలో మే 29న జరిగిన మంత్రివర్గ సమావేశం ఈమేరకు నిర్ణయం తీసుకొంది. 4, 5 తేదీల్లో కొత్త సభ్యుల ప్రమాణస్వీకారం, 6న స్పీకర్ ఎన్నిక, 9న పార్లమెంటు ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం, 10, 11 తేదీల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చ ఉంటుంది. ఇంకా ఏదైనా అత్యవసర వ్యవహారాలు ఉంటే సమావేశాలను పొడిగించే విషయం గురించి ఆలోచిస్తారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ఎం.వెంకయ్యనాయుడు ఈ వివరాలు వెల్లడించారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగే చర్చలో ప్రధానమంత్రి మాట్లాడుతారని తెలిపారు. "ఏళ్లుగా లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న కమల్‌నాథ్ ప్రొటెంస్పీకర్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు తోడుగా అర్జున్‌చరన్‌సేథీ (బీజేడీ), పీఏసంగ్మా (మాజీ స్పీకర్), బీరేంద్రసింగ్ (కాంగ్రెస్) ప్యానల్‌స్పీకర్లుగా ఉంటారు. స్పీకర్ ఎన్నిక తర్వాత డిప్యూటీ స్పీకర్ ఎంపిక గురించి నిర్ణయం తీసుకుంటారు. రాజ్యసభ సమావేశాలు 9 నుంచి ప్రారంభమవుతాయి. ప్రమాణస్వీకారం చేయాల్సిన కొత్త సభ్యులెవరైనా ఉంటే ఆరోజు చేస్తారు." అని చెప్పారు.

తగినంత సంఖ్యాబలం లేని వారికి ప్రతిపక్ష నేత హోదా ఇస్తారా? అని అడిగినప్పుడు గతంలో ఉన్న సంప్రదాయాలను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని సమాధానం ఇచ్చారు. డిప్యూటీ స్పీకర్‌ను ప్రతిపక్షాలకు ఇచ్చే అంశం గురించి గత సంప్రదాయాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మాజీమంత్రులు తక్షణం ఢిల్లీలోని నివాసాలను వదిలిపెట్టాలని కోరారు. అప్పుడే కొత్తమంత్రులకు నివాసాలు కేటాయించడానికి వీలవుతుందని పేర్కొన్నారు.

**స్పీకర్ ఎంపికపై మల్లగుల్లాలు**

లోక్‌సభ స్పీకర్ పదవికి సరైన నేత ఎవరన్న దానిపై కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ఎనిమిదోసారి ఎంపీగా గెలిచిన సుమిత్ర మహాజన్, భాజపా సీనియర్‌నేత మురళీ మనోహర్‌జోషి పేర్లను తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీనిపై మే 29న జరిగిన కేంద్రమంత్రివర్గ సమావేశంలో చర్చించినట్లు ఎన్‌డీఏ వర్గాలు వెల్లడించాయి. జూన్ ఆరున లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరగనుంది. ఉపస్పీకర్ పదవిని అన్నాడీఎంకేకుగానీ తృణమూల్ కాంగ్రెస్‌కుగానీ ఇవ్వవచ్చని ఆ వర్గాలు తెలిపాయి. లోక్‌సభలో కాంగ్రెస్ తర్వాత ఇవి అతిపెద్ద పార్టీలుగా ఉన్న విషయం తెలిసిందే. మరోవైపు, కాంగ్రెస్‌కు తగినన్ని సీట్లు లేనప్పటికీ లోక్‌సభ ప్రతిపక్షనేత పదవిని ఆ పార్టీకి ఎన్‌డీఏ ఇచ్చే అవకాశం ఉంది. రాజ్యసభలో తాము మైనార్టీలో ఉన్నందున అక్కడ మెజారిటీపార్టీగా ఉన్న కాంగ్రెస్ సహకారం తప్పనిసరి కాబట్టి ఎన్‌డీఏ ఈ నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది. ◆



# మోడీ సర్కారు ముందున్న సవాళ్లు

కొత్త ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ ఎదుర్కోనున్న సవాళ్లు ఎన్నో ఉన్నాయి. యూపీఏ హయాములో దేశ పరిపాలన వ్యవస్థ ధ్వంసమైంది. ఖాళీ ఖజానా వెక్కిరిస్తోంది. ద్రవ్యోల్బణం అదుపుతప్పింది. తయారీ రంగంలో అతి తక్కువ వృద్ధి నమోదవుతోంది. ఆహార భద్రత చట్టం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాల అమలు పెనుభారం కానున్నది. విద్యావ్యవస్థ కునారిల్లుతోంది. పార్లమెంటులోకి అడుగు మోపుతున్న అవినీతిపరుల సంఖ్యా తక్కువేమీ కాదు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చుకోవడానికీ చాలా కష్టపడాల్సి వస్తుంది. వ్యవసాయ రంగ తిరోగమనం ఆందోళన కలిగిస్తోంది. ఈ అవరోధాలను అధిగమించి, దేశాన్ని ప్రగతిపథంలో పరుగులెత్తించడానికి మోడీ ఎలాంటి చర్యలు చేపడతారో చూడాలిప్పుడు!

### కొత్త తరహా సంస్కరణలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నేపథ్యంలో బడ్జెట్ రూపకల్పన కేంద్రప్రభుత్వానికి మరో పెద్ద సవాలు కానున్నది. యువత ఉపాధి కోరుతోంది. మహిళలు భద్రత కావాలంటున్నారు. ఈ విషయంలో నరేంద్ర మోడీ హామీల్ని వారు నమ్మారు. అందుకే ఆయనకు మద్దతుగా నిలిచారు. కార్పొరేట్‌రంగం సైతం ఆయనకు చేదోడుగా నిలిచింది. అందరి ఆశలూ ఆయన మీదే. వారి అంచనాల మేరకు పనిచేయడానికి నరేంద్ర మోడీ సరైన ఆర్థిక విధానాలు అనుసరించాలి. శక్తిమంతమైన రిజర్వుబ్యాంకు ఎలాగూ ఆయనకు అండగా ఉంటుంది. కొత్త తరహా ఆర్థిక సంస్కరణల దిశగా ఆయన సాగాల్సిన అవసరం ఉంది. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు రాజకీయంగా సర్దుబాటు ధోరణిలో వ్యవహరిస్తాయి. రాజ్యసభలో ఇప్పటికీ యూపీఏకే మెజారిటీ ఉంది. ఎన్డీఏ ప్రభుత్వ విధానాలకు అది అడ్డుపడే ప్రమాదం ఉంది. దేశం ఎదుర్కొంటున్న అనేక ఆర్థిక సమస్యలకు పరిష్కారాలు సూచించే మేధావులకు కొదవ లేదు. ఇది మన అదృష్టమే. స్వల్పకాలిక, దీర్ఘకాలిక సమస్యలేవో గుర్తించి, ప్రాధాన్యాలు నిర్ణయించుకోవడం కొంచెం కష్టమే. కానీ, ఆ పనిచేయక తప్పదు. కేవలం అధికారం మీద మమకారంతోనే తనతో కలిసి వచ్చినవారిని మోడీ దూరం పెట్టాలి.

### అవినీతిపరులకు హెచ్చరిక

పరిపాలన వ్యవస్థను చక్కదిద్దడానికి మోడీ అన్నింటికన్నా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. పట్టాలు తప్పిన అధికార యంత్రాంగాన్ని ఆయన ముందుగా గాడిలో పెట్టడం ఎంతో అవసరం. అవినీతి పేట్రేగిపోతోంది. దాన్ని ఎదుర్కోవడం కష్టంగా మారింది. అవినీతిని ఇంకెంతమాత్రం సహించబోనన్న గట్టి సందేశాన్ని మోడీ పంపాలి. కట్టుతప్పితే వేటు తప్పదని హెచ్చరించాలి. నిజాయతీపరులు, నిష్కళంకులైన ఉన్నతాధికారులకు కొదవలేదు. వారి మీద ప్రభుత్వం విశ్వాసం ఉంచాలి. స్వేచ్ఛగా పనిచేసే అవకాశాన్ని వారికి కల్పించాలి. వారు ఏ విషయంలోనూ ఎంతమాత్రం నిర్లక్ష్యం చూపకుండా, అలసత్వం వహించకుండా, సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకునేందుకు అలాంటి స్వేచ్ఛాయుత వాతావరణం అవసరం. ముందుగా ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ)తోపాటు ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాలు, పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వ శాఖల్లో ప్రక్షాళన చేపట్టాలి. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి, సత్వర చర్యలు తీసుకునేందుకు వీలుగా సాధికార నైతిక వ్యవహారాల కమిటీని ఏర్పాటు చేస్తే బాగుంటుంది. కేంద్ర హోంమంత్రి సారథ్యంలో దాన్ని ఏర్పాటు చేయాలి. ఎవరైనా తప్పు చేసినట్లు నైతిక వ్యవహారాల కమిటీ నిర్ధారిస్తే, వారిని వెంటనే శిక్షించాలి. వారు ప్రభుత్వాన్ని కోర్టుకు లాగితే, ఆ వ్యవహారాన్ని ప్రభుత్వ న్యాయవాదులు చూసుకోవాలి.

### ప్రాథమిక విద్యలో కెనడా ఆదర్శం

కొత్త ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాల్సిన మరో కీలకరంగం–విద్య. యూపీఏ సర్కారు రకరకాల ప్రయోగాలు చేసి, ప్రాథమిక, మాధ్యమిక విద్యారంగంతో చెలగాటమాడింది. విద్యారంగంలో వైఫల్యానికి ఎవరూ బాధ్యత వహించని పరిస్థితి ఏర్పడింది. సార్వత్రిక ప్రాథమిక విద్యకు సంబంధించి కెనడా నమూనాను అనుసరిస్తే మేలు. ఆ నమూనా ప్రకారం... అన్ని ప్రాథమిక పాఠశాలల్లో అయిదు కిలోమీటర్ల పరిధిలోని పిల్లలను వివిధ తరగతుల్లో చేర్చుకోవాల్సి ఉంటుంది. రెండు కిలోమీటర్ల పరిధిలో ఉండే విద్యార్థులకు స్కూలు బస్సు సదుపాయం

కల్పించరు. స్కూలు బస్సు సదుపాయం కావాలంటే, వారు బస్‌పాసులు తీసుకోవాల్సిందే. అన్ని పాఠశాలల్లో గ్రంథాలయాలు ఉంటాయి. విద్యార్థులు వాటిలోనే పాఠాలు చదువుకొంటారు. వర్కు పుస్తకాలు మాత్రమే కొనాల్సి ఉంటుంది. ఆ పాఠశాలల్లో పేదలు, ధనికులన్న తారతమ్యాలు ఉండవు. జాతి మత భేదాలు ఉండవు. అందరూ సమానమే. డొనేషన్ల ప్రసక్తే లేదు. మనం భారతదేశంలో చూస్తున్న తరహా పబ్లిక్ స్కూళ్లకు అవకాశమే లేదు. అయిదు కిలోమీటర్ల పరిధిలో ఉంటే- ప్రధాన మంత్రి బిడ్డ అయినా, గుమాస్తా బిడ్డ అయినా అదే పాఠశాలలో కలిసి మెలిసి చదువుకోవాల్సిందే. ఆట మైదానాలు లేని ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలే ఉండవు. పాఠశాలలు ఉదయం తొమ్మిది గంటలకు మొదలై మధ్యాహ్నం మూడు గంటలదాకా సాగుతాయి. వారానికి ఒకరోజు పాఠశాలలోనే అత్యంత ఆరోగ్యకర వాతావరణంలో ఆహారం వండి, విద్యార్థులకు వడ్డిస్తారు. మిగతా రోజుల్లో విద్యార్థులకు ఆహార పొట్లాలు అందజేస్తారు. ఉదయం 11.30 గంటలకు 45 నిమిషాలసేపు ఆటవిడుపు ఇస్తారు. ఆ సమయంలో విద్యార్థులు వాతావరణ పరిస్థితుల్నిబట్టి అవుట్‌డోర్ లేదా ఇండోర్ ఆటలు ఆడుకోవలసి ఉంటుంది. మధ్యాహ్నం 1.30 గంటలకు 45 నిముషాలసేపు భోజన విరామం ఉంటుంది. తల్లిదండ్రులే తమ పిల్లలకు ప్రామాణిక నోటు పుస్తకాలు, జామెట్రీ బాక్సు, క్యాలిక్యులేటర్ల వంటి ఉపకరణాలు సమకూర్చవలసి ఉంటుంది. పిల్లల చదువు సంధ్యల గురించి వాకబు చేయాలని అధ్యాపకుడు భావించినప్పుడు- తల్లిదండ్రులు వెంటనే తగిన రీతిలో స్పందించాల్సి ఉంటుంది. అక్కడి బడుల్లో సంస్కృతి, చరిత్ర, భౌగోళిక శాస్త్రం, మౌలిక విజ్ఞాన శాస్త్రాలు, గణితం వంటి పాఠ్యాంశాలు, క్రీడలు తప్పనిసరి. విద్యార్థులందరికీ గ్రేడ్లు ఇస్తారు. ఆ విషయాన్ని ఎప్పటికప్పుడు వారి తల్లిదండ్రులకు తెలియజేస్తారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. స్కూలుఫీజుకానీ, డొనేషన్లుకానీ అసలు ఉండవు. ప్రతి తరగతిలో 24మంది విద్యార్థులే ఉంటారు. ప్రతి 15నుంచి 20మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉంటారు. విద్యార్థుల చదువు సంధ్యలకు క్లాస్‌టీచరే బాధ్యులు. మనదేశంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో చూస్తూనే ఉన్నాం. ప్రాథమిక విద్య రాష్ట్రప్రభుత్వ పరిధిలోనే ఉంది. అయినా, ఈ రంగంలో సంస్కరణలను తీసుకొచ్చే విషయమై రాష్ట్రప్రభుత్వాలతో చర్చకు కేంద్రప్రభుత్వం చొరవ తీసుకోవాలి. దానివల్ల తరవాతి తరం బంగారు భవితకు గట్టి పునాది ఏర్పడుతుంది.

### విద్యకు అధిక నిధులు

ఉన్నత విద్యారంగంలోనూ అదే పద్ధతి అనుసరించాలి. ప్రతి రాష్ట్రంలో వచ్చే అయిదేళ్లపాటు విద్యారంగానికి ఆరు శాతం బడ్జెట్ కేటాయించాలి. పాఠశాల భవనాల మెరుగుకు, బడుల్లో నాణ్యమైన చదువు లభించే పరిస్థితి కల్పించడానికే ఆ నిధులను ఉపయోగించుకోవాలి. గ్రామీణ పాఠశాలల్లోని 80శాతం పాఠశాలలకు సరైన పైకప్పులు ఉండవు. భవనాలు పగుళ్లు బారి ఉంటాయి. వానకాలంలో వర్షపు నీరు తరగతి గదుల్లోకి చేరుతుంది. సరైన మరుగుదొడ్లు ఉండవు. ఆట మైదానాల జాడా కరవే. తగినన్ని బెంచీలు, నల్లబల్లలూ ఉండవు. ఒకవేళ ఎక్కడైనా ఈ సదుపాయాలు ఉన్నాయనుకున్నా- అర్హులైన ఉపాధ్యాయుల కొరత వెంటాడుతుంది. ఉపాధ్యాయులకు జీతభత్యాలు ఇవ్వడంలో ఆలస్యం జరగకుండా చూడటానికి పాఠశాలలకు నిధులను సకాలంలో, సక్రమంగా విడుదల చేయాలి. మంచి విలువలు, సంస్కృతీ సంప్రదాయాలపట్ల గౌరవ మన్ననలు కలిగిన కొత్త తరాన్ని నిర్మించేది ఉపాధ్యాయులే కాబట్టి, వారికి సరైన సామాజిక భద్రత చేకూర్చాలి.

### రాష్ట్రాలకు వ్యవసాయ బాధ్యతలు

కొత్త ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాల్సిన మరో కీలక రంగం- వ్యవసాయం. ఇది ప్రస్తుతం ఉమ్మడి జాబితాలో ఉంది. పరిశోధన-అభివృద్ధి విభాగాన్ని మాత్రమే కేంద్రం తన వద్ద అట్టిపెట్టుకొని వ్యవసాయానికి సంబంధించి మిగతా అంశాలన్నింటినీ రాష్ట్రప్రభుత్వాలకు అప్పగిస్తే మంచిది. విస్తరణ కార్యక్రమాలు, సకాలంలో తగిన స్థాయిలో ఉత్పాదకాల సరఫరా, మార్కెట్‌పరమైన మద్దతు వంటి అంశాలకు రాష్ట్రప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రస్తుతం వ్యవసాయానికి కేటాయిస్తున్న బడ్జెట్ రెండు శాతం లేదా అంతకన్నా లోపే. దాన్ని కనీసం నాలుగు శాతానికి పెంచాలి. రైతుల ఆత్మహత్యలకు తావులేని విధంగా వ్యవసాయ రంగాన్ని తీర్చిదిద్దే బాధ్యతను రాష్ట్రప్రభుత్వాలకు అప్పగించాలి. పంట ప్రణాళిక, కనీస మద్దతు ధరలు, పంట, వాతావరణ బీమా వంటి అంశాల్ని రాష్ట్రప్రభుత్వాల పరిధిలోకి చేర్చాలి. కేంద్రప్రభుత్వం సమన్వయ సంస్థగా మాత్రమే వ్యవహరించాలి. దేశంలో వివిధ రాష్ట్రాలగుండా ఎన్నో నదులు ప్రవహిస్తున్నాయి. ఈ దృష్ట్యా నీటిహక్కుల పరిరక్షణకు కేంద్రప్రభుత్వం తగిన చట్టం చేయాలి. ఆ చట్టం కింద ట్రైబ్యునళ్లు ఏర్పాటుచేసి, వివాదాల పరిష్కార బాధ్యతను వాటికే అప్పగించాలి. కోర్టు గుమ్మం తొక్కడమన్నది

చిట్టచివరి మార్గం కావాలి. సమస్యల పరిష్కారానికి సమర్థమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.

**గ్రామీణ ఆర్థికానికి ప్రోత్సాహం**

ఏటా పదిలక్షల ఉద్యోగాలు ఇవ్వడమన్నది పెద్దసవాలు. శ్రామికజనం పట్టణప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సంస్కరించి, చక్కదిద్దితేనే ఈ లక్ష్యం సుసాధ్యమవుతుంది. ప్రతి జిల్లాలో గ్రామీణ పారిశ్రామిక సముదాయాన్ని ఏర్పాటు చేయాలి. పూర్తిస్థాయిలో నీరు, విద్యుత్తు, మురుగునీటి సదుపాయాలతో వెయ్యినుంచి రెండు వేల చదరపు గజాల్లో పారిశ్రామిక ప్లాట్లను ఏర్పాటు చేయాలి. భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్నందువల్ల పదేళ్ల లీజు ప్రాతిపదికన ఆ ప్లాట్లను ఇవ్వాలి. తరవాత మరో పదేళ్లు పొడిగించాలి. లేదా వాయిదా రూపేణా డబ్బు చెల్లించే విధంగా అమ్మివేయాలి. సులభంగా రుణాలు ఇచ్చేందుకు వీలుగా ఆర్థిక సంస్థలకు వాటి లీజుదారు హక్కులు కల్పించాలి. ఈ గ్రామీణ పారిశ్రామిక సముదాయాలకు అయిదు కిలోమీటర్ల పరిధిలో బహుళ అంతస్తుల నివాస భవనాలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నిర్మించాలి. గ్రామీణ పారిశ్రామిక సముదాయాల్లో ప్రయోగశాలలు, ప్రమాణాల ధ్రువీకరణ, ప్యాకేజింగ్ విభాగాల వంటివి ఏర్పాటు చేయాలి. సమీప నగర ప్రాంతాల్లో వాటికి అనుబంధం ఏర్పరచాలి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన రవాణా వాహనదారుల సేవలనే ఉపయోగించుకోవాలి. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి సంస్థలనుంచి నిధులు సేకరించి విద్యుత్, నీరు, రవాణా వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి. పట్టణ, నగర ప్రాంతాలను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఉత్పత్తి రవాణా కేంద్రాలుగా రూపొందించాలి. ఇలాంటివి చేపడితే వచ్చే అయిదేళ్లలో సేవారంగం 60శాతం, తయారీరంగం 25శాతం వృద్ధి సాధిస్తాయి. వ్యవసాయరంగం 15శాతం వాటా నిలబెట్టుకొంటుంది. ఫలితంగా అయిదేళ్లలో ఆర్థికవ్యవస్థ తొమ్మిది నుంచి పదిశాతం దాకా వృద్ధి సాధించగలుగుతుంది. అదే నిజమైన ప్రజా విజయమవుతుంది. భారత ప్రజాస్వామ్యం అప్పుడే వర్ధిల్లుతుంది. ▲

**- బెహరా ఎర్రంరాజు,** (రచయిత ఆర్థికరంగ నిపుణులు)

---

# సమాఖ్య వ్యవస్థ బలోపేతానికి కృషి

## పీఎంఓ అధికారులతో మోడీ తొలి భేటీ

దేశ సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేయటానికి కృషి చేస్తానని ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్పష్టం చేశారు. ముఖ్యంగా తన కార్యాలయం రాష్ట్రాలు లేవనెత్తే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, తీవ్రత ప్రాతిపదికగా వాటిని పరిగణనలోకి తీసుకుని స్పందించాలని కోరుకుంటున్నా నన్నారు. ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మర్నాడు ఆయన ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) అధికారులతో తొలిసారి భేటీ అయ్యారు. దేశాభివృద్ధి రాష్ట్రాల అభివృద్ధిపై ఆధారపడి ఉన్నందున రాష్ట్రాలు లేవనెత్తే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వటం చాలా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఇది మన సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు వీర్ సావర్కర్ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ పార్లమెంటులో ఆయనకు నివాళులు అర్పించారు. సావర్కర్ గొప్ప రచయిత, కవి, సంఘ సంస్కర్తని కొనియాడారు. సైన్యాధిపతి జనరల్ విక్రమ్‌సింగ్ మే28న ప్రధానమంత్రి నరేంద్రమోడీతో భేటీ అయ్యారు. సైన్యాధిపతి, వైమానికదళాధిపతి వేర్వేరుగా రక్షణమంత్రి అరుణ్‌జైట్లీని కూడా కలుసుకున్నారు.

**నృపేంద్ర నియామకంపై వివాదం:** "టెలికం నియంత్రణ ప్రాధికార సంస్థ(ట్రాయ్)" ఛైర్మన్‌గా పనిచేసిన మాజీ ఐఏఎస్ అధికారి నృపేంద్ర మిశ్రాను ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యకార్యదర్శిగా నియమించడంపై వివాదం చెలరేగింది. ఆయన ప్రభుత్వ పోస్టులో చేరడానికి చట్టం అనుమతించకపోవడంతో, దానిని సవరిస్తూ సిబ్బంది వ్యవహారాల శాఖ ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. నృపేంద్ర 2009లో ట్రాయ్ ఛైర్మన్‌గా పదవీ విరమణ చేశారు. ట్రాయ్ ఛైర్మన్‌గాని, సభ్యులుగాని పదవీ విరమణ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పోస్టుల్లో చేరకుండా ట్రాయ్ చట్టం-1997 నిషేధిస్తోంది. ఇప్పుడు ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ ఈ నిబంధనను సవరించింది. ఆర్డినెన్స్ జారీని కాంగ్రెస్ తప్పుబట్టింది. నృపేంద్ర సామర్థ్యాన్ని తాము శంకించడం లేదని అంటూనే, ఆయన నియామకానికి ఆర్డినెన్స్ మార్గాన్ని ఎందుకు ఎంచుకున్నారని ఏఐసీసీ సమాచార విభాగం ఛైర్మన్ అజయ్ మాకెన్ ప్రశ్నించారు. ◆

# నల్లధనం వెలికితీతకు "సిట్" ఏర్పాటు

## మోడీ మంత్రివర్గం తొలినిర్ణయం



నరేంద్రమోడీ ప్రభుత్వం తొలి అడుగులోనే అవినీతిపై యుద్ధం ప్రకటించింది. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగానే నల్లధనం వెలికితీతపై తన సంకల్పాన్ని చాటుకుంది. భారతీయ సంపన్నులు విదేశాల్లో దాచిన నల్లధనాన్ని వెనక్కి తీసుకురావటం కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని కేంద్ర సర్కారు నిర్ణయించింది. ఇక్కడి ప్రధాన మంత్రి కార్యాలయంలో నరేంద్ర మోడీ నేతృత్వంలో జరిగిన తొలి మంత్రివర్గ సమావేశం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 29లోపు సిట్‌ను ఏర్పాటుచేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర న్యాయ, టెలికాంశాఖా మంత్రి రవిశంకర్‌ప్రసాద్ వెల్లడించారు. సిట్‌కు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎం.బి.షా ఛైర్మన్‌గా, సుప్రీంకోర్టు మరో మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరిజిత్ పసాయత్ ఉపఛైర్మన్‌గా ఉంటారని తెలిపారు. మంత్రివర్గ సమావేశం తర్వాత రవిశంకర్‌ప్రసాద్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ వివరాలు తెలియజేశారు. మంత్రివర్గ తొలి సమావేశంలో నల్లధనం వెలికితీతకు సిట్ ఏర్పాటు, గోరఖ్‌పూర్ రైలు ప్రమాద బాధితులకు పరిహారం ప్రకటించడం వరకే పరిమితమైనట్లు ఆయన తెలిపారు.

**మా చిత్తశుద్ధికి నిదర్శనం:** సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా సిట్‌ను ఏర్పాటు చేయటం తమ చిత్తశుద్ధికి నిదర్శనమని రవిశంకర్‌ప్రసాద్ చెప్పారు. సిట్‌లో రెవెన్యూ సెక్రటరీ, సీబీఐ, ఇంటెలిజెన్స్ బ్యూరో, రా, ఈడీ డైరెక్టర్లు, సీబీడీటీ ఛైర్మన్, ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ విధంగా దేశంలోని అత్యున్నతస్థాయి ఫైనాన్షియల్, రెవెన్యూ, ఎకానమిక్ మేనేజ్‌మెంట్ సీనియర్ అధికారులందరూ సిట్ దర్యాప్తులో భాగస్వాములవు తారన్నారు. నల్లధనాన్ని వెలికి తీయడానికి సిట్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాల అమలులో జాప్యం జరిగిందని, మే28తో గడువు ముగుస్తున్నందునే కొత్త ప్రభుత్వం తొలి అజెండాలోనే దీన్ని చేర్చి నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. సిట్ ఏర్పాటుపై కేంద్రం మే27 సాయంత్రం ఒక పత్రికా ప్రకటన కూడా విడుదల చేసింది. దీని ప్రకారం.. సిట్‌లో నార్కోటిక్స్ కంట్రోల్‌బ్యూరో డైరెక్టర్ జనరల్, రెవెన్యూ ఇంటలిజెన్స్ డైరెక్టర్, ఫైనాన్షియల్ ఇంటలిజెన్స్ యూనిట్ డైరెక్టర్, సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ జాయింట్ సెక్రటరీ కూడా సభ్యులుగా ఉంటారు. మరోవైపు, సిట్‌కు విశేషాధికారాలున్నాయని ఈ ప్రకటన వెల్లడించింది. దీని ప్రకారం.. హసన్‌అలీ వ్యవహారంతోపాటు లెక్కాపత్రంలేని ఇతర అక్రమ లావాదేవీలపైనా దర్యాప్తునకు, విచారణకు సిట్‌కు అధికారం ఉంది. నల్లధనానికి సంబంధించి ఇప్పటికే దర్యాప్తు ప్రారంభమైన కేసులతోపాటు, పెండింగ్‌లో ఉన్నవాటిలో, దర్యాప్తుకోసం ఎదురుచూస్తున్న కేసుల్లో, లేదంటే ఇప్పటికే దర్యాప్తు పూర్తయిన వాటిల్లోకూడా జోక్యం చేసుకొని తిరిగి దర్యాప్తు చేపట్టవచ్చు. ఈ విధంగా నల్లధనం వెలికితీతకు అవసరమైన సమగ్ర కార్యాచరణను సిట్ రూపొందిస్తుంది. తన దర్యాప్తునకు సంబంధించిన ప్రగతిని ఎప్పటికప్పుడు కోర్టుకు నివేదిక రూపంలో వెల్లడిస్తుంది. కేంద్రం నిర్ణయంపై జస్టిస్ షా స్పందిస్తూ.. నల్లధనం వెలికితీత అంశంలో అనేక సంక్లిష్టతలు ఇమిడి ఉన్నాయని, అయినప్పటికీ వీలైనంత త్వరలో దర్యాప్తు పూర్తి చేయటానికి ప్రయత్నిస్తానని చెప్పారు. నల్లధనం వెలికితీతపై

# నల్లధనంపై వేగంగా దర్యాప్తు

- జస్టిస్ ఎం.బి.షా

నల్లధనం వెలికితీత విషయంలో పలు సంక్లిష్టతలు ఇమిడి ఉన్నా విచారణ వేగంగా జరిగేలా చూస్తామని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నాయకత్వ బాధ్యతలు చేపట్టనున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎం.బి.షా చెప్పారు. కేంద్రంలో బాధ్యతలు చేపట్టిన నూతన ప్రభుత్వం... తొలి మంత్రి వర్గ సమావేశంలోనే నల్ల ధనం వెలికితీతకు జస్టిస్ షా నేతృత్వంలో సిట్‌ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. "దీనిలో అనేక సంక్లిష్టతలు ఉండవచ్చు. అవి ఎలాంటివో ఇప్పుడే చెప్పడం కష్టం. కానీ వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తాను"అని జస్టిస్ షా "పీటీఐ" వార్తాసంస్థకు ఫోన్ ద్వారా ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. విచారణ కమిషన్‌లు, కమిటీలు తమ నివేదికలు సమర్పించడంలో గతంలో చోటు చేసుకున్న జాప్యాల గురించి ఆయన వద్ద ప్రస్తావించగా తాను సాధ్యమైనంత త్వరగా పని పూర్తిచేయడానికి ప్రయత్నిస్తానని చెప్పారు.

**నా జోలికి వచ్చేందుకు ఎవరూ సాహసించలేదు...**

"ఒడిశా, గోవాల్లో అక్రమంగా గనుల తవ్వకాలపై వేసిన కమిషన్లకు నేను ఛైర్మన్‌గా వ్యవహరించాను. దర్యాప్తు ప్రారంభించిన రెండు నెలల్లోనే తొలి మధ్యంతర నివేదికను సమర్పించాను. తర్వాత గోవా నివేదికను ఆరు నెలల్లో ఇచ్చాను. ఒడిశాపై తదుపరి నివేదికను ఇంకో ఆరు నెలల్లో ఇచ్చాను. అందువల్ల నల్లధనంపై విచారణ నివేదికనూ వీలైనంత త్వరగా పూర్తి చేయగలననే నమ్మకం ఉంది" అని జస్టిస్ షా పేర్కొన్నారు. విదేశీ బ్యాంకుల్లో నల్లధనాన్ని దాచుకున్న వారిలో రాజకీయ ప్రముఖులు, కార్పొరేట్ దిగ్గజాలు ఉన్నా వారి విషయంలో కఠినంగానే వ్యవహరిస్తానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. "నేను చాలా ఏళ్లు న్యాయమూర్తిగా చేశాను. 15 ఏళ్లు హైకోర్టు న్యాయమూర్తిగా సేవలందించాను. అయిదేళ్లు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నాను. వ్యక్తుల గురించి నాకేమీ పట్టింపు లేదు. నా జోలికి వచ్చేందుకు ఎవరూ సాహసించలేదు. అందువల్ల అలాంటివాటి కోసం ఆందోళన చెందాల్సిన అవసరమే లేదు" అని ఆయన స్పష్టం చేశారు. సిట్ ఏర్పాటుపై చొరవ గురించి మాట్లాడుతూ అది సుప్రీంకోర్టు ఆదేశమనీ, ప్రభుత్వం దానికి కట్టుబడి ఉండాల్సిందేనని అన్నారు. "ఈ అంశం గత రెండేళ్లుగా పెండింగులో ఉంది. ఆ తర్వాత రివ్యూ పిటిషన్‌పై స్టే ఉత్తర్వు మంజూరయింది. ఆ స్టే 15 రోజుల క్రితమే తొలగిపోయింది. సాధ్యమైనంత త్వరగా విచారణ జరపాలని గత వారమే సుప్రీంకోర్టు ఆదేశించింది" అని జస్టిస్ షా వివరించారు. సుప్రీం ఉత్తర్వులను ప్రభుత్వం ఆచరించి తీరాలనీ, రివ్యూ పిటిషన్‌ను కొట్టివేశాక నల్ల ధనాన్ని తప్పనిసరిగా కనుగొనడం మినహా కొత్త ప్రభుత్వానికైనా మరో ప్రత్యామ్నాయం లేదని స్పష్టం చేశారు.

---

రివ్యూపిటిషన్‌ను సుప్రీంకోర్టు ఇటీవల కొట్టివేసిన నేపథ్యంలో ఏ ప్రభుత్వమైనా సిట్‌ను ఏర్పాటుచేయక తప్పదని ఆయన వ్యాఖ్యానించారు.

**సిట్ నేపథ్యం:** విదేశాల్లో దాగిన భారతీయుల నల్లధనాన్ని వెలికితీయడానికి సిట్‌ను ఏర్పాటుచేయాలని 2011 జులై 4న సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ న్యాయవాది రాంజెఠ్మలానీ దాఖలుచేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, జస్టిస్ ఎస్.ఎస్.నిజ్జర్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. సిట్ ఛైర్మన్‌గా జస్టిస్ బి.పి.జీవన్‌రెడ్డిని నియమిస్తూ తక్షణం నోటిఫికేషన్ జారీచేయాలని పేర్కొంది. అయితే యూపీఏ ప్రభుత్వం ఈ ఉత్తర్వులను ఖాతరు చేయలేదు. ఈనెల 1న ఇదేకేసుపై మళ్లీ విచారణ జరిపిన సుప్రీంకోర్టు జస్టిస్ ఎం.బి.షా నేతృత్వంలో ఈ నెల 29లోపు సిట్‌ను ఏర్పాటుచేస్తూ నోటిఫికేషన్ జారీచేయాలని మరోసారి ఆదేశించింది. మన్మోహన్‌సింగ్ స్థానంలో అధికారపగ్గాలు చేపట్టిన మోడీ.. తొలి మంత్రివర్గ సమావేశంలోనే సిట్ ఏర్పాటుకు నిర్ణయించారు. ▲

# ఆర్థిక రంగాన్ని గాడిలోకి తెస్తా

**కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ**

ధరల అదుపు, ఆర్థిక వ్యవస్థపై ఇన్వెస్టర్లలో విశ్వాస్ పునరుద్ధరణ, విత్తలోటుకు పగ్గాలు, వేస్తూనే మెరుగైన వృద్ధి రేటు సాధన తన తక్షణ ప్రాధాన్యతలని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థ క్లిష్టదశలో ఉన్నమాట వాస్తవమని చెబుతూ ఇలాంటి పరిస్థితిలో సవాళ్లు సహజమేనని ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. ఆర్థిక స్థిరీకరణపై విశేషంగా దృష్టి సారించక తప్పదని ఆయన స్పష్టం చేశారు. ఒక అదనపు బాధ్యతగా మాత్రమే తాను రక్షణ శాఖను కూడా నిర్వహిస్తున్నానని ఆయన తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థపై విశ్వాసాన్ని పూర్తి స్థాయిలో పునర్నిర్మించాల్సినంత గడ్డు స్థితిలో తాను ఆర్థిక శాఖ పగ్గాలు చేపట్టిన విషయం తనకు తెలుసునని ఆయన పేర్కొన్నారు. ఎన్నో ఆశలతో ప్రజలు తమకు పట్టం కట్టారని, జాతీయ స్థాయిలో వచ్చిన రాజకీయ మార్పే దేశీయ, విదేశీ ఇన్వెస్టర్లకు బలమైన సంకేతమని ఆయన అన్నారు. వచ్చే రెండు మాసాల కాలంలో తాను విధాన నిర్ణయ ప్రక్రియను వేగవంతం చేయడంపై దృష్టి సారిస్తానని జైట్లీ చెప్పారు. కొత్త ప్రభుత్వ విధానాలేమిటన్నది వచ్చే కొద్ది రోజుల్లో సంపూర్ణంగా ప్రకటిస్తామని తెలిపారు. వృద్ధి రేటును పణంగా పెట్టి ద్రవ్యోల్బణం అదుపు చేస్తారా అన్న ప్రశ్నకు రెండింటి మధ్య సమతూకం తీసుకురావాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2008 లో ఏర్పడిన అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభానికి ముందు కాలంలో 9 శాతం పైబడిన వృద్ధి రేటు సాధించిన భారత ఆర్థిక వ్యవస్థ 2012-13లో పదేళ్ల కనిష్ట స్థాయి 4.5 శాతానికే పరిమితం అయింది. 2013-14 లో కాస్తంత మెరుగుపడి 4.9 శాతం వృద్ధి రేటు సాధించగా ఈ ఏడాది 5.5 శాతం వృద్ధి రేటు సాధించగలమని అంచనా వేస్తున్నారు.

## జైట్లీతో రాజన్ భేటీ

ఆర్‌బిఐ గవర్నర్ రఘురామ్ రాజన్, కొత్త ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో సమావేశమై దేశంలో ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక పరిస్థితి, నిత్యావసర వస్తువుల ధరల, ఇతర కీలకాంశాలపై చర్చించారు. రిజర్వ్ బ్యాంకు జూన్ మూడో తేదీన ద్రవ్యపరపతి విధాన సమీక్ష ప్రకటించనున్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. ఇరువురూ సుమారు 50 నిముషాల పాటు భిన్న అంశాలపై చర్చించారు. ద్రవ్యోల్బణం అదుపులోకి తేవడం తప్పనిసరి అని ఆర్‌బిఐ, ప్రభుత్వ కూడా భావిస్తున్నాయని సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాజన్ చెప్పారు. ధరలు అదుపు చేయడం తన తక్షణ ప్రాధాన్యతల్లో ఒకటని అంతకు ముందే జైట్లీ స్పష్టం చేశారు. ఆర్‌బిఐ ద్రవ్యోల్బణాన్ని అదుపులోకి తేవడం లక్ష్యంగా వడ్డీ రేట్లను గరిష్ట స్థాయిల్లో నిలకడగా ఉంచడంపై స్పందించిన కొత్త ఆర్థికమంత్రి రెండింటి మధ్య సమతుల్యత తీసుకురావాల్సి ఉంటుందని నొక్కి చెప్పారు. ఆర్‌బిఐ ఎప్పుడు వృద్ధికి, ద్రవ్యోల్బణానికి మధ్య సమతూకం పాటిస్తూనే ఉన్నదని ఈ సందర్భంగా రాజన్ అన్నారు. కరెంట్ ఖాతా లోటు జిడిపిలో 1.7 శాతానికి తగ్గడంపై స్పందిస్తూ ఇది అత్యంత ఆరోగ్యకరమైన పరిణామమని రాజన్ పేర్కొన్నారు. బంగారంపై ఆంక్షల సడలింపు గురించి ప్రశ్నించగా రానున్న కొద్ది రోజుల్లో విధాన ప్రకటనలుంటాయి కదా, వేచి చూడండి అని ఆయన అన్నారు.

## క్యాడ్, కరెన్సీపై ఫోకస్

అంతర్జాతీయ మార్కెట్లలో ఆటుపోట్లు ఇప్పటికీ కొనసాగుతున్నందు వల్ల కరంట్ ఖాతా లోటు (క్యాడ్), రూపాయి కదలికలను నిశితంగా పర్యవేక్షిస్తూనే ఉంటామని ఆర్థిక శాఖ కార్యదర్శి అర్వింద్ మయారామ్ చెప్పారు. కొత్త ఆర్థిక మంత్రితో సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2013-14 ఆర్థిక సంవత్సరంలో క్యాడ్ జిడిపిలో 1.7 శాతానికి దిగి రావడం చాలా సానుకూల పరిణామమని ఆయన పేర్కొన్నారు. స్థూల ఆర్థికాంశాలపై తాను ఆర్థికమంత్రితో ముచ్చటించానని, తదుపరి సవివరమైన ప్రెజెంటేషన్‌లో అన్ని విషయాలు సమూలంగా ప్రస్తావిస్తామని ఆయన తెలిపారు. సమీప భవిష్యత్తులో రూపాయి కదలికలు ఒక పరిధిలోనే ఉండవచ్చునని మయారామ్ అన్నారు. ▲

# భారత్ సత్తా చాటిచెప్పడమే లక్ష్యం

## సుష్మాస్వరాజ్ స్పష్టీకరణ

ప్రపంచానికి భారత్ సత్తా సాటి చెప్పడమే తన లక్ష్యమని విదేశాంగ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ ఉద్ఘాటించారు. కేంద్ర మంత్రిగా మే 28న ఆమె బాధ్యతలు స్వీకరించారు. పదవీబాధ్యతల స్వీకరణ సందర్భంగా మున్ముందు చేపట్టనున్న చర్యలను వెల్లడించారు. కేంద్రమంత్రులుగా పలువురు మే28న తమ తమ శాఖల బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో అధికారులతో సమావేశాలు.... ఉన్నతాధికారులు ప్రొటోకాల్ మేరకు సంబంధిత మంత్రులను కలుసుకోవడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. కొందరు కార్యదర్శులు, అధికారులు తమతమ శాఖలకు సంబంధించిన వివరాలను కొత్తమంత్రులకు తెలియచేశారు. కొన్ని శాఖల అధికారులు సవివరమైన ప్రెజెంటేషన్ ఇచ్చారు.

తనకిచ్చిన భారీ పరిశ్రమల శాఖ పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన శివసేనకు చెందిన అనంత్ గీతే కూడా ఎట్టకేలకు పదవీ బాధ్యతలు స్వీకరించారు. త్వరలోనే మరో శాఖకు బదలాయిస్తామన్న హామీ నేపథ్యంలోనే ఆయన రాజీ పడినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై శివసేన సారథి ఉద్ధావ్ థాకరే ప్రధానమంత్రి నరేంద్రమోడీతో సంతృప్తికరమైన చర్చలు జరిపినట్లు గీతే పేర్కొన్న విషయం గమనార్హం.

ఎం.వెంకయ్య నాయుడు (పట్టణాభివృద్ధి, పార్లమెంటరీ వ్యవహారాలు), సుష్మాస్వరాజ్ (విదేశాంగ వ్యవహారాలు), అనంత్ కుమార్ (రసాయనాలు, ఎరువులు), ఉమాభారతి (జలవనరులు), మేనకాగాంధీ (మహిళా, శిశు సంక్షేమ శాఖ), రాధామోహన్ సింగ్( వ్యవసాయ శాఖ)లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. శాస్త్రీయ, సాంకేతిక శాఖ సహాయమంత్రి (స్వతంత్ర హోదా)గా జితేంద్రసింగ్ బాధ్యతలు చేపట్టారు. జలవనరుల శాఖ సహాయమంత్రిగా సంతోష్ కుమార్ గంగవర్ సైతం బాధ్యతలు స్వీకరించారు. సౌత్‌బ్లాక్‌కు వచ్చిన మంత్రి సుష్మాస్వరాజ్‌కు విదేశాంగ కార్యదర్శి సుజాతా సింగ్, ఇతర సీనియర్ అధికారులు ఘనంగా స్వాగతం పలికి తోడ్కొని వెళ్లారు. ఈశాన్య భారత అభివృద్ధి శాఖ మంత్రిగా నియమితులైన జనరల్(విశ్రాంత) వీకే.సింగ్ మే 29న పదవీబాధ్యతలు స్వీకరిస్తారు.

**మందుల ధరల తగ్గింపునకు యత్నం: అనంత్‌కుమార్**

ఖాయిలా పడిన యూరియా తయారీ కర్మాగారాలను "అత్యవసర మందుల ధరలను 25 నుంచి 40 శాతం దాకా తగ్గించేందుకు యత్నిస్తా. ఈ దిశగా ఫార్మాస్యూటికల్ కంపెనీలతో చర్చిస్తా. అన్ని అత్యవసర మందులూ అందుబాటు ధరల్లో ఉండాలన్నదే లక్ష్యం. పేదలకు ఈ వెసులు బాటు అందేలా చూస్తాం. దేశవ్యాప్తంగా ఖాయిలాపడిన యూరియా తయారీ కర్మాగారాలను పునరుద్ధరిస్తాం. దీని తయారీలో భారత్ స్వావలంబన సాధించేలా కృషిచేస్తాం. ఖరీఫ్‌లో యూరియాకు ఎలాంటి కొరతలేకుండా చర్యలు చేపడతాం. దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగానికి ఇదే నా వాగ్దానం".

**కేంద్ర మంత్రివర్గానికి రాష్ట్రపతి విందు**

నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర మంత్రిమండలి సభ్యులకు రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ విందునిచ్చారు. కొత్తగా ఏర్పడిన మంత్రిమండలికి రాష్ట్రపతి విందు ఇవ్వడం ఆనవాయితీ.

**ప్రపంచదేశాలన్నిటితో సత్సంబంధాలు: సుష్మా**

"పాకిస్థాన్‌తో భారత్ చక్కటి సంబంధాలను కోరుకుంటోంది. అయితే, పాక్ తన భారత్ వ్యతిరేక తీవ్రవాద కార్యకలాపాలకు స్వస్తి చెప్పాలి కదా! ప్రపంచానికి భారత్ సత్తా సాటి చెప్పడమే నా లక్ష్యం. ఇరుగుపొరుగుతోనే కాదు...ప్రపంచదేశాలన్నిటితో సంబంధాల మెరుగే నా ఆశయం. బాంబు పేలుళ్లు కొనసాగినంత కాలం....ఉభయదేశాల మధ్య చర్చలనేవి నిష్ఫలమేనని ప్రధాని నరేంద్రమోడీ ఇప్పటికే పాక్‌ప్రధాని నవాజ్ షరీఫ్‌కు నిష్కర్షగా చెప్పారు".

**గంగా ప్రక్షాళనకు అత్యధిక ప్రాధాన్యత: ఉమాభారతి**

"పవిత్ర గంగానదీ ప్రక్షాళనకు కట్టుబడి ఉన్నా. "అవిరళ్ గంగా...నిర్మల్ గంగా" నాదంతో పరమ పావన గంగానదిని పవిత్రం చేస్తాం. ఇందుకోసం ఓ విధానాన్ని రూపొందిస్తాం. దేశంలోని మిగిలిన నదుల ప్రక్షాళనకూ నడుం బిగిస్తాం. వాటిని కాలుష్య రహితంగా, ప్రజలకు సురక్షిత తాగునీటిని అందిచేలా తయారుచేస్తాం. ఇంతటి గురుతర బాధ్యత ఉన్న శాఖను నాకు కేటాయించినందుకు ప్రధానికి కృతజ్ఞతలు". ▲

# దేశంలో 100 స్మార్ట్ నగరాలు

## కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి వెంకయ్యనాయుడు

> **విశాఖ, విజయవాడ మెట్రోలకు ప్రాధాన్యం**
> **జంట నగరాలుగా విజయవాడ-గుంటూరు**
> **గృహరుణాల వడ్డీ రేట్ల తగ్గింపుపై దృష్టి**
> **జేఎన్ఎన్‌యూఆర్ఎం స్థానంలో కొత్త పథకం**

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో చెప్పిన విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టుకు, విజయవాడ-గుంటూరు-తెనాలి మెట్రో రైల్ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని కేంద్ర మంత్రి ఎం.వెంకయ్యానాయుడు స్పష్టంచేశారు. తద్వారా విజయవాడ-గుంటూరు నగరాలను కలుపుతామని చెప్పారు. మే28 ఉదయం ఢిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణం, పట్టణ దారిద్ర్య నిర్మూలనశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వ ప్రాధాన్యాలు ఎలా ఉండబోతున్నాయో సూచనప్రాయంగా చెప్పారు. సారాంశం ఆయన మాటల్లోనే-

**విజయవాడ-గుంటూరులను కలుపుతాం:** ప్రధానమంత్రి చెప్పినట్లు 100 కొత్త స్మార్ట్ నగరాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తాం. మంచి ప్రమాణాలతో జీవనం సాగించేలా చూడటం ఈ నగరాల ప్రత్యేకత. సమీప నగరాలను కలపడానికి ప్రయత్నిస్తాం. హైదరాబాద్-సికింద్రాబాద్‌లాగానే విజయవాడ-గుంటూరులను జంట నగరాలుగా మార్చడానికి వీలవుతుంది. అలాగే శివారు ప్రాంతాల్లో శాటిలైట్ నగరాలు నిర్మించి మౌలిక వసతులు కల్పిస్తాం.

**2020 నాటికి అందరికీ ఇళ్లు:** 2020 నాటికి అందరికీ పక్కా ఇళ్లు కల్పించాలన్నదే మా లక్ష్యం. ఈ విషయంలో ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం ఉండాలని కోరుకుంటున్నా. కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యత కింద ఉద్యోగులకు ఇళ్లు కట్టించడంపై దృష్టి సారించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు కూడా చేతులు కలపాలి. ఎల్ఐసీ, బ్యాంకులు, రైల్వేలు వంటి ప్రభుత్వ రంగ సంస్థలు సొంత ఉద్యోగులకు నివాస సౌకర్యం కల్పిస్తే ఈ లక్ష్యాన్ని చేరుకోగలం. ఎల్ఐసీ, హడ్కోలాంటి సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద హేతుబద్ధమైన ధరల్లో రుణాలు అందించి గృహ నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలి. అందరికీ గృహవసతి కల్పించాలంటే వడ్డీ తగ్గించడంతోపాటు, వడ్డీలో రాయితీలు ఇవ్వాలి. దీనికి మా శాఖ ప్రాధాన్యం ఇస్తుంది.

**జేఎన్ఎన్‌యూఆర్ఎం స్థానంలో కొత్త మిషన్:** 2050 నాటికి సగం జనాభా పట్టణాలకు చేరడం భారత్‌కు అతిపెద్ద సవాలు. దీన్ని ఎదుర్కోవడానికి పట్టణాల నవీకరణ, నాణ్యమైన ప్రజారవాణాకల్పనకు ప్రాధాన్యమిస్తాం. ఏడేళ్ల జేఎన్ఎన్‌యూఆర్ఎం గడువు త్వరలో ముగియనుంది. దాని స్థానంలో కొత్త పథకం తీసుకొస్తాం. భౌగోళిక సమాచార వ్యవస్థ(జీఐఎస్)ను వినియోగిస్తూ నగరాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడంపై దృష్టిసారిస్తాం. ప్రజారవాణాపై దృష్టి పెట్టి నగరాలను అనుసంధానిస్తాం. వేగవంతంగా అభివృద్ధి అయ్యే బెంగుళూరు, హైదరాబాద్, పుణె, కోల్‌కతాల్లో ట్రామ్ సర్వీస్‌లు ప్రవేశపెట్టడం గురించి ఆలోచిస్తాం. ఇందులో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తాం. బహిరంగ, వాణిజ్య ప్రాంతాల్లో ఇంటర్నెట్ కోసం వైఫై సౌకర్యం కల్పిస్తాం.

**ఢిల్లీ మెట్రో విస్తరణ:** ఢిల్లీ మెట్రోను కొత్త ప్రాంతాలకు విస్తరిస్తాం. హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌కు చేర్చే అంశంపై దృష్టి సారిస్తాం. చెన్నై, బెంగుళూరు, కోచిలో మెట్రోరైల్ నిర్మాణం వేగవంతం చేస్తాం.

**పేదలకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ :** పట్టణ దారిద్ర్య నిర్మూలన దిశగా పేద మహిళలు, యువత నైపుణ్యాన్ని మెరుగుపరుస్తాం. ఇళ్లులేని పేదల కోసం నగరాల్లో షెల్టర్లు నిర్మిస్తాం.

**ఆధ్యాత్మిక నగరాల పరిశుభ్రత:** దేశంలోని ఆధ్యాత్మిక నగరాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తాం. దానివల్ల భక్తులు పెరిగి పర్యాటకం అభివృద్ధి చెందుతుంది. ▲

# మల్టీ బ్రాండ్ రిటైల్‌లో ఎఫ్‌డిఐలను అనుమతించం

## కేంద్ర వాణిజ్యశాఖామంత్రి నిర్మలా సీతారామన్

మల్టీ బ్రాండ్ రిటైల్ (ఎంబిఆర్) రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించబోమని వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. భారత రిటైలింగ్‌లోకి విదేశీ సంస్థలు పెద్ద ఎత్తున ప్రవేశిస్తే, మధ్య, సూక్ష్మ తరహా వ్యాపారులు, చిన్న రైతులు దెబ్బతింటారని ఆమె అన్నారు. బిజెపి మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలకు, నిర్ణయాలకు కట్టుబడి ఉంటామని ఆమె పేర్కొన్నారు. ఒక్క ఎంబిఆర్‌లో తప్ప, ఆస్తుల సృష్టికి, ఉద్యోగాల కల్పనకు, ఇన్‌ఫ్రా మెరుగుదలకు, కొత్త టెక్నాలజీల కొనుగోలుకు అవకాశం ఉన్న అన్ని రంగాల్లో ఎఫ్‌డిఐలకు అనుమతిస్తామని బిజెపి తన మేనిఫెస్టోలో పేర్కొంది. ఎఫ్‌డిఐ పాలసీని క్రమబద్ధీకరిస్తామని సీతారామన్ చెప్పారు. ఎగుమతుల వృద్ధి తమ తొలి ప్రాధాన్యమని ఆమె తెలిపారు. విదేశాలతో ఆర్థిక సంబంధాలు, వాణిజ్య కార్యకలాపాలు పెంచుకోవడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రిగా కూడా ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. యుపిఎ-2 ప్రభుత్వం ఎంబిఆర్ రంగంలో ఎఫ్‌డిఐలను ఆహ్వానించడంతో, బ్రిటన్‌కు చెందిన టెస్కో టాటా గ్రూప్‌నకు చెందిన ట్రెంట్‌తో కలిసి 50:50 జాయింట్ వెంచర్ చేపట్టేందుకు ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను మార్చి యుపిఏ ప్రభుత్వం ఆమోదించింది.

**వేచి చూడాల్సిందే**

కొత్త ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై వేచి చూసే ధోరణి అవలంబిస్తామని భారతీయ రిటైలర్ల సంఘం సిఇఒ కుమార్ రాజగోపాలన్ తెలిపారు. ఎంబిఆర్ రంగంలో ఎఫ్‌డిఐలను అడ్డుకోవడంతో పాటు, రిటైల్ రంగాన్ని ప్రోత్సహించే మరిన్ని చర్యలను బిజెపి తన మేనిఫెస్టోలో ప్రకటించిందని ఆయన చెప్పారు. రిటైల్ ఇన్‌ఫ్రాను మెరుగుపరుస్తామని, ఆధునికీకరణ చర్యలు చేపడతామని, సరఫరా విభాగాన్ని మెరుగుపరుస్తామని బిజెపి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కొత్త ప్రభుత్వం తన హామీలను నెరవేరుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఫ్యూచర్ గ్రూప్, టెస్కో, ఆర్‌పి-సంజీవ్‌గోయెంకా గ్రూప్, భారతి రిటైల్, ఇన్ఫినిటీ రిటైల్, క్రోమా బ్రాండ్ రిటైల్ స్టోర్లు.... సీతారామన్ ప్రకటనపై స్పందించడానికి నిరాకరించాయి.

# ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణపై పరిశీలన

## కేంద్రమంత్రి అశోక్‌గజపతి రాజు స్పష్టీకరణ

ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణపై హడావుడి నిర్ణయమేమీ ఉండదని అశోక్ గజపతి రాజు సంకేతాలిచ్చారు. కొత్త ప్రభుత్వం అన్ని అంశాలనూ పరిశీలిస్తుందని చెప్పారు. “ప్రైవేటు ఎయిర్‌లైన్స్‌తో పాటు ప్రభుత్వ రంగ సంస్థ కూడా ఉంది. ఇతర దేశాల్లోనూ ప్రభుత్వ రంగ సంస్థలున్నాయి. అక్కడ అవి బాగానే పని చేస్తున్నాయి. ఎందుకో కానీ ఇక్కడ మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అన్ని కోణాల్లోనూ పరిశీలించాలి. ఎయిర్ ఇండియా విషయంలో సానుకూలతలూ ఉన్నాయి. ప్రతికూలతలూ ఉన్నాయి. ఎలా అభివృద్ధి చేయాలో మేము పరిశీలించాలి. మొత్తం మీద ఈ అంశంపై ఇంకా నిర్ణయమేమీ తీసుకోలేదు. వివిధ అంశాలపై అవగాహనకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.” అని విలేకర్లతో చెప్పారు..

**దేశీయ టెర్మినల్‌కు ఎన్టీఆర్ పేరు**

హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో దేశీయ విభాగానికి ఇదివరకు ఉన్నట్లుగానే ఎన్టీఆర్ పేరు పెడతామని కేంద్ర పౌరవిమానయానశాఖా మంత్రి అశోక్‌గజపతిరాజు స్పష్టం చేశారు. ఇదివరకు అంతర్జాతీయ విభాగానికి రాజీవ్, దేశీయ విభాగానికి ఎన్టీఆర్ పేరు ఉండేదని ఆయన గుర్తుచేశారు. యూపీయే ప్రభుత్వం వచ్చి ఎన్టీఆర్ పేరును తొలగించిందని విచారం వ్యక్తం చేశారు.

# జాతీయ ఆహార భద్రత మిషన్‌లో రాష్ట్రానికి కోత

## ఐదు జిల్లాలను తొలగించి... మూడింటిని చేర్చిన కేంద్ర ప్రభుత్వం



రాష్ట్ర వరి రైతులకు కేంద్ర ప్రభుత్వం షాకిచ్చింది. జాతీయ ఆహార భద్రత మిషన్(ఎన్.ఎఫ్.ఎస్.ఎం) పథకంలో ఐదు జిల్లాలను తొలగించి కొత్తగా మరో మూడింటిని చేరుస్తూ రాష్ట్రానికి ఉత్తర్వులు పంపింది. ఈ నిర్ణయంతో మొత్తం మీద పథకం అమలు చేసే జిల్లాల సంఖ్య రాష్ట్రంలో 11 నుంచి 9కి తగ్గిపోయింది. వచ్చేనెల నుంచి అమలులోకి వచ్చే కొత్త ఖరీఫ్ సీజన్ నుంచి ఆదేశాలు అమల్లోకి రానున్నాయి. ఇంతకాలం ఈ పథకాన్ని అమలు చేయడం వల్ల ఆయా జిల్లాల్లో వరి సగటు ఉత్పాదకత పెరిగిందని కేంద్రం అంచనాకు వచ్చింది. రాష్ట్ర సగటు ఉత్పాదకత కన్నా పెరిగిన జిల్లాలను ఈ పథకం నుంచి తొలగించినట్లు సమాచారం. ఈ సగటు కన్నా తక్కువ ఉత్పాదకత ఉన్న జిల్లాలను ఈ పథకంలోకి తెస్తున్నట్లు తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది.

**కొత్తగా చేర్చిన జిల్లాలు:** కడప, అనంతపురం, వరంగల్.

**తొలగించిన జిల్లాలు:** కృష్ణా, గుంటూరు, మెదక్, నెల్లూరు, నల్గండ. ఈ జిల్లాల రైతులకు రాయితీలు అందే అవకాశం లేకుండా పోయింది.

ఎన్.ఎఫ్.ఎస్.ఎం. పథకం అమలు వల్ల ఒక్కో హెక్టారు విస్తీర్ణంలో వరి సాగుచేసే రైతుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.7500 దాకా రాయితీలు అందుతాయి.రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపితే పాత జిల్లాలను తొలగించకుండానే కొత్తవి చేర్చే అవకాశం ఉంటుంది. దేశం మొత్తం మీద గతేడాది వరకూ ఈ మిషన్‌ను 210 జిల్లాల్లో అమలుచేయగా ఈ ఖరీఫ్ నుంచి వాటిని 199కి తగ్గించారు. నల్గండ, మెదక్ జిల్లాలను కూడా పథకంలో కొనసాగించేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తే రైతులకు మేలు జరుగుతుందని ఓ ఉన్నతాధికారి "ఈనాడు" కు చెప్పారు.

**పథకం లక్ష్యమిది:** దేశవ్యాప్తంగా ఏటా 10 కోట్ల టన్నుల బియ్యం పండించే లక్ష్యంతో జాతీయ ఆహార భద్రత మిషన్‌ను కేంద్రం అమలుచేస్తోంది. ఇందుకోసం ధాన్యం ఉత్పాదకత తక్కువగా ఉండే జిల్లాలకు పథకాన్ని వర్తింపజేసి రాయితీలు ఇస్తోంది. ఈ ఏడాది మొత్తం రాష్ట్రానికి పథకం కింద రూ.160 కోట్లు కేటాయించగా అందులో వరి రైతుల కోసం రూ.52.93 కోట్లు ఇచ్చింది. మిగతా సొమ్మును పప్పుధాన్యాలు, తృణధాన్యాల పంటల సాగుకు ప్రోత్సాహకంగా ఇవ్వాలని తాజాగా సూచించింది.

**రాయితీల్లో మార్పులు:** వరి సాగులో కూలీల ఖర్చులు బాగా పెరిగిపోయాయని ఈ ఏడాది నుంచి కొత్తగా రాయితీలు ఇవ్వడానికి పలు మార్పులు చేసింది. ఉదాహరణకు వరి నారు పోయడం, నాట్లు వేయడం వంటి పనులకు కూలీల ఖర్చు చాలా అవుతోంది. దీన్ని తగ్గించేందుకు నేరుగా విత్తే విధానాన్ని ప్రోత్సహించాలని దానికి సంబంధించిన యంత్రాలకు రాయితీలు ప్రకటించింది. నేరుగా వరి విత్తులు వేసే డ్రమ్‌సీడర్ యంత్రం ఖరీదులో సగం లేదా గరిష్ఠంగా రూ.1500లు రాయితీగా ఇవ్వాలని, కోనోవీడర్ యంత్రాన్ని రైతు కొనుగోలు చేస్తే రూ.600 రాయితీ ఇవ్వాలని సూచించింది. బోర్లు ఉన్న రైతులు 10 అశ్వికశక్తి(హెచ్.పి.) మోటారు కొనుక్కుంటే ధరలో రూ.10 వేల దాకా రాయితీ ఇవ్వాలని తెలిపింది. బోర్ల సాగుపై ఆధారపడిన రాయలసీమ, తెలంగాణ రైతులకు ఈ రాయితీలు ఉపయోగకరం.

**ఇక నుంచి ఆహార భద్రత పథకం అమలయ్యే జిల్లాలు:** ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, కడప, అనంతపురం, వరంగల్. ▲

# రాష్ట్రాలకు రాజ్యసభ సభ్యుల లాటరీ కేటాయింపు

## నలుగురు తెలంగాణ సభ్యులు ఆంధ్రకు.... ఆంధ్ర నుంచి ఇద్దరు తెలంగాణకు

రాజ్యసభ సభ్యుల విభజనలో స్థానాలు తారుమారయ్యాయి. రాజ్యసభ ఛైర్మన్ హమీద్ అన్సారీ నిర్వహించిన లాటరీలో ఇద్దరు ఆంధ్ర సభ్యులు తెలంగాణకు, నలుగురు తెలంగాణ సభ్యులు ఆంధ్రకు వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం- 2014లోని మూడో భాగం, సెక్షన్ 12, 13ల ప్రకారం ప్రస్తుతం సమైక్యాంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న 18 మంది రాజ్యసభ సభ్యులను రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం (జూన్ 2) నాటికి తెలంగాణకు ఏడుగురు, ఆంధ్రప్రదేశ్‌కు 11 మంది చొప్పున లాటరీ పద్ధతిలో పంపిణీ చేయాల్సి ఉంది. ఇందుకోసం రాజ్యసభ ఛైర్మన్ హమీద్ అన్సారీ తొమ్మిది మంది ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ సభ్యుల సమక్షంలో లాటరీ తీశారు. ఇందులో వి.హనుమంతరావు, గుండు సుధారాణి, రాపోలు ఆనందభాస్కర్, గరికపాటి మోహన్‌రావు, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డితోపాటు ఆంధ్రకు చెందిన కేవీపీ రామచంద్రరావు, సీఎం రమేష్‌లు తెలంగాణకు వెళ్లారు. తెరాస సభ్యుడు కె.కేశవరావు, తెలంగాణ తెలుగుదేశం నాయకుడు దేవేందర్‌గౌడ్, కాంగ్రెస్ తెలంగాణ సభ్యులు రేణుకాచౌదరి, ఎంఏ ఖాన్‌లతోపాటు సుజనా చౌదరి, జేడీ శీలం, జైరాం రమేష్, టి.సుబ్బరామిరెడ్డి, తోట సీతారామలక్ష్మి, చిరంజీవిలు ఆంధ్రకు వెళ్లారు. లాటరీ ద్వారా సభ్యులు మరో ప్రాంతానికి మారినప్పటికీ వారు పాత నోడల్ జిల్లాలకే ప్రాతినిధ్యం వహించేలా కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేస్తామని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి ప్రకాశ్ జవదేకర్ చెప్పారు. ఎంపీ నిధులు కూడా సొంత రాష్ట్రాలకు ఖర్చు చేసుకొనేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

**మారే వెసులుబాటు ఉందేమో చూస్తాం**

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రాజ్యసభ సభ్యుల విభజనకు లాటరీ తీయడం మినహా గత్యంతరం లేకపోయిందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. తెలంగాణ- ఆంధ్రకు కేటాయించిన సభ్యుల్లో ఇద్దరు పరస్పర అంగీకారంతో అటూ ఇటూ మారడానికి అవకాశం కల్పిస్తూ విభజన చట్టానికి సవరణ తీసుకురావచ్చేమో పరిశీలిస్తామన్నారు. అలాంటి అవకాశం ఉంటే సవరణ తీసుకొస్తామన్నారు. పరస్పర స్థాన మార్పిడికి రాజ్యాంగ సవరణ అవసరం లేదని, కేవలం ఆంధ్రప్రదేశ్ విభజన చట్టానికి సవరణ సరిపోతుందన్నారు. అయితే దీని సాధ్యాసాధ్యాలు, భవిష్యత్తులో తలెత్తే పరిణామాలను పరిశీలించాల్సి ఉందన్నారు. గతంలో బీహార్ విభజన సమయంలో ఇలాంటి సవరణ తెచ్చినట్లు సభ్యులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వం అందరికీ సాధ్యమైనంత న్యాయం చేసేలా.. ఆమోదయోగ్యమైన వెసులుబాటుకు ప్రయత్నిస్తుందని హామీ ఇచ్చారు. అయితే ఈ వెసులుబాటు కల్పించినా.. ఇద్దరు ఆంధ్ర సభ్యులు తెలంగాణకు వెళ్లినందున ఆ మేరకు ఇద్దరు తెలంగాణవారు అటు, ఇద్దరు ఆంధ్రవారు ఇటు రావడానికి మాత్రమే వీలుంది.

2016 జూన్ 21న రిటైర్ అవుతున్నవారిలో జేడీ శీలం, జైరాం రమేష్, ఎన్.జనార్దన్‌రెడ్డి, సుజనాచౌదరి ఆంధ్రప్రదేశ్‌కు, వి.హనుమంతరావు, గుండు సుధారాణి తెలంగాణకు వెళ్లారు. ఈ లాట్‌లో ఏ రాష్ట్రం వారు ఆ రాష్ట్రానికే పరిమితం కావడంతో సమస్య ఏర్పడలేదు. 2018 ఏప్రిల్ 2న రిటైర్ కాబోతున్న వారిలో తెదేపా సభ్యులు దేవేందర్‌గౌడ్ ఆంధ్రకు, సీఎం రమేష్ తెలంగాణకు వెళ్లినందున వీరిద్దరూ పరస్పర అంగీకారంతో స్థానాలు మార్చుకునే అవకాశం ఉంది. రేణుకాచౌదరి మాత్రం ఆంధ్రప్రదేశ్ సభ్యురాలిగానే కొనసాగాల్సి వస్తుంది. 2020 ఏప్రిల్ 9న రిటైర్ కాబోతున్న వారిలో తెలంగాణ, ఆంధ్రలకు వెళ్లిన కాంగ్రెస్ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, ఎంఏ ఖాన్‌లు పరస్పరం స్థానాలు మార్చుకోవచ్చు. లేదా కేవీపీ -కేశవరావు అయినా పరస్పర అంగీకారానికి రావొచ్చు. మరో తెలంగాణ సభ్యుడు మాత్రం ఆంధ్రకే ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది.

**నేదురుమల్లి సీటు ఆంధ్రకే**

నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి మృతితో ఖాళీ అయిన రాజ్యసభ సీటు లాటరీలో ఆంధ్రప్రదేశ్‌కే దక్కింది. ▲

# ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో "సైకిల్" జోరు

**ఐదు జిల్లాలకే పరిమితమైన వైసీపీ**
**ఓట్ల శాతం బాగానే ఉన్నా.. సీట్లు దక్కించుకోలేని 'ఫ్యాన్'**
**సీమాంధ్రలో ఏకపక్షంగా తీర్పు**

## రాష్ట్రంలో ఓటర్ల తీర్పు

సీమాంధ్రలో 'సైకిల్' బ్రేకులు లేకుండా దూసుకు పోయింది. ఓట్ల శాతంలో పెద్దగా తేడా లేకున్నా.. సీట్ల విషయానికి వచ్చేసరికి వైసీపీ చతికిలపడింది. 13 జిల్లాల్లో నువ్వా-నేనా అని పోటీపడిన టీడీపీ, వైసీపీ మధ్య ఓట్ల శాతంలో మాత్రం పెద్ద తేడా కనిపించడంలేదు. కానీ అత్యధిక నియోజకవర్గాలున్న జిల్లాల్లో ఓటర్లు టీడీపీ వైపు మొగ్గు చూపడంతో ఆ పార్టీ అధికారాన్ని కైవసం చేసుకోగలిగింది. వైసీపీ ఇందుకు భిన్నమైన పరిస్థితిని ఎదుర్కొంది. రాయలసీమలోని 3 జిల్లాలతోపాటు కోస్తాలో నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మాత్రమే టీడీపీ మీద వైసీపీ అత్యధిక ఓట్లను సాధించగలిగింది. ఈ 5 జిల్లాల్లో 60 అసెంబ్లీ, 9 ఎంపీ స్థానాలుంటే ఇందులో 41 అసెంబ్లీ, 7 ఎంపీ స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. 25 ఎంపీలు, 115 అసెంబ్లీ స్థానాలున్న మిగిలిన 8 జిల్లాల్లో కేవలం 1 ఎంపీ, 26 అసెంబ్లీ స్థానాలను మాత్రమే ఆ పార్టీ గెలుచుకోగలిగింది. సీమాంధ్రలో వైసీపీ అధికారాన్ని చేపట్టలేక పోవడానికి ఈ జిల్లాల్లోని ఓటర్లు చూపించిన విముఖతే ప్రధాన కారణం.

ఈ 8 జిల్లాల్లో భారీ స్థాయిలో ఓట్లను రాబట్టుకోవడం ద్వారా టీడీపీ అధికారాన్ని కైవసం చేసుకోగలిగింది. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ పట్నం జిల్లాలతోపాటు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో టీడీపీ హవాకి ఎదురులేకుండాపోయింది. ఈ ఐదు జిల్లాల్లో 68 అసెంబ్లీ, 10 ఎంపీ స్థానాలకుగాను 50 అసెంబ్లీ, 7 ఎంపీ సీట్లను టీడీపీ గెలుచుకుంది. టీడీపీతో పొత్తు పెట్టుకున్న బీజేపీ 3 ఎమ్మెల్యేలు, రెండు ఎంపీ స్థానాల్లో విజయం సాధించింది. పిఠాపురంలో టీడీపీ రెబల్ అభ్యర్థి విజయం సాధించారు. ఇక మిగిలిన 14 అసెంబ్లీ, 1 ఎంపీ స్థానాన్ని మాత్రమే వైసీపీ గెలుచుకోగలిగింది. ఇక టీడీపీతో దాదాపు సమానంగా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఓట్లను రాబట్టుకున్న వైసీపీ పది స్థానాల్లో విజయం సాధించింది. ఈ రెండు జిల్లాల్లో టీడీపీ 22 చోట్ల విజయం సాధిస్తే, బీజేపీ 1 చోట గెలుపొందింది. మొత్తంమీద చూస్తే రెడ్లు, ముస్లింలు, క్రైస్తవులు అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో వైసీపీ ఆధిపత్యం కనపడుతుంది. కాపులు, కమ్మ, బ్రాహ్మణ, రాజులు, బీసీలు ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో సైకిల్ దూసుకుపోయింది. బీజేపీ కూడా ఈ ప్రాంతాల్లోనే సీట్లను గెలుచుకోగలిగింది. వైసీపీ ప్రాబల్యం ఉన్న 5 జిల్లాల్లో విడిగానే కాకుండా కూటమి పరంగా కూడా టీడీపీ-బీజేపీ ఓట్లు, సీట్ల విషయంలో వెనకపడింది. దీనినిబట్టి ఆయా ప్రాంతాల్లోని సామాజిక అంశాలు పార్టీల గెలుపు ఓటముల్లో కీలకపాత్రను పోషించినట్లు కనిపిస్తున్నది. ఇక నిన్నటి వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ గెలవడం పక్కనపెడితే.. చాలా చోట్ల డిపాజిట్లును కూడా దక్కించుకోలేక దారుణ ఓటమిని చవిచూసింది. దాదాపు 2 కోట్ల 90లక్షల మంది ఓటు హక్కు వినియో గించుకున్న సీమాంధ్రలో హస్తానికి కేవలం 8లక్షల ఓట్లు మాత్రమే దక్కాయి. విజయనగరం, కర్నూలు జిల్లాల్లో మినహా మిగిలిన 11 జిల్లాల్లో ఆ పార్టీకి లక్షలోపు మాత్రమే ఓట్లు వచ్చాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత మొట్టమొదటిసారిగా ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. వామపక్షాలు, లోక్‌సత్తా, జై సమైక్యాంధ్ర పార్టీలు కూడా తుడిచిపెట్టుకుపోయాయి.▲

# తెలంగాణలో తెరాసకే ఓట్లు.. సీట్లు..

కారులో 11 ఎంపీ, 63 ఎమ్మెల్యే సీట్లను ఎగరేసుకుపోయిన టీఆర్ఎస్.. ప్రత్యర్థి పార్టీలకు అందనంత స్థాయిలో సీట్లతోపాటు ఓట్లనూ దక్కించుకుంది! తెలంగాణలో అత్యధిక ఓట్లను సాధించి అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణలో మొత్తం పోలైన ఓట్లు 1.95 కోట్లు! వాటిలో 66 లక్షలకుపైగా ఓట్లను టీఆర్ఎస్ సాధించింది. నిన్నటి వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు కేవలం 49 లక్షల ఓట్లు మాత్రమే దక్కాయి. టీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు మధ్య ఓట్లలో తేడా 17 లక్షలకుపైగా ఉందంటే కారు జోరును అర్థం చేసుకోవచ్చు. ఇక, తెలంగాణలో టీడీపీకి 28 లక్షలకుపైగా ఓట్లు వస్తే.. బీజేపీ అందులో సగానికి సగం దాదాపు 14 లక్షల ఓట్లను దక్కించుకుంది. పొత్తు పెట్టుకుని కూటమిగా బరిలోకి దిగిన టీడీపీ, బీజేపీలకు కలిపి తెలంగాణలో దాదాపు 42 లక్షల ఓట్లు వచ్చాయి.

ఇక, తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగిన వైసీపీ ఆరున్నర లక్షల ఓట్లును సాధించి, ఒక ఎంపీ, మూడు ఎమ్మెల్యే స్థానాలను కైవసం చేసుకుంది. కొంతకాలంగా తెలంగాణలో పార్టీని విస్తరించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్న ఎంఐఎం.. మూడు జిల్లాల్లో మాత్రమే ఓట్లను సాధించగలిగింది. ముఖ్యంగా హైదరాబాద్‌లో 6 లక్షల ఓట్లతో ఒక ఎంపీ, 8 ఎమ్మెల్యే స్థానాలను కైవసం చేసుకుంది. రంగారెడ్డి జిల్లాలో 85 వేలు, నిజామాబాద్‌లో 31 వేల ఓట్లను సాధించింది. ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఎంఐఎంకు ఓట్లు రాలేదు. ఇక, తెలంగాణలో వామపక్షాల పరిస్థితి మరీ ఘోరంగా మారింది. తెలంగాణకు జైకొట్టి.. ఉద్యమంలో కూడా పాల్గొని.. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన సీపీఐ లక్షా 75 వేల ఓట్లు సాధిస్తే.. సమైక్యాంధ్రే తమ విధానమని చెప్పి.. వైసీపీతో పొత్తు పెట్టుకుని ఖమ్మంలోని కొన్ని నియోజక వర్గాల్లో మాత్రమే పోటీ చేసిన సీపీఎం మూడు లక్షల వరకు ఓట్లను సాధించడం విశేషం. సీపీఐతో పోలిస్తే.. రాష్ట్రంలో ఉనికి లేని బీఎస్పీ రెండున్నర లక్షలకుపైగా ఓట్లను సాధించి రెండు ఎమ్మెల్యే సీట్లను కైవసం చేసుకుంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో అత్యధిక సీట్లును కైవసం చేసుకున్న టీడీపీ- బీజేపీ కూటమికి, టీఆర్ఎస్‌కి మధ్య ఓట్ల విషయంలో పెద్ద తేడా లేకపోవడం గమనార్హం. టీడీపీ-బీజేపీ కూటమి తర్వాత అత్యధిక ఓట్లు టీఆర్ఎస్‌కే పడ్డాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలో కూడా కాంగ్రెస్ కంటే అత్యధిక ఓట్లును టీఆర్ఎస్ సాధించడం విశేషం.

# తెలంగాణ కాంగ్రెస్‌కు 'క్రెడిట్' దక్కలేదు

తెలంగాణ ఇచ్చిన 'క్రెడిట్' కాంగ్రెస్‌కు దక్కలేదని ఏఐసీసీకి టీపీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య నివేదిక సమర్పించనున్నారని సమాచారం. ఒకటి రెండు రోజుల్లో ఢిల్లీ వెళ్లి సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ ఓటమికి కారణాలను వివరిస్తూ ఒక నోట్‌ను అధిష్ఠానానికి అందించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాం తం లో కాంగ్రెస్ ఓటమికి పలు కారణాలున్నాయని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. విశ్వసనీయవర్గాల కథనం మేరకు ఈ నివేదిక లో ఓటమికి కారణాలను కర్ర విరక్కుండా పాము చావకుండా అన్నట్లుగా ఉంటుందని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చిందన్నది వాస్తవమే అయినప్పటికీ.. కేసీఆర్ కొట్లాడినందునే వచ్చిందని ప్రత్యేక రాష్ట్రాన్ని కాంక్షించిన ప్రతి ఒక్కరూ నమ్మారని.. అందువల్లే ఆయన విజయం సాధించారని పొ న్నాల వివరించనున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే విధంగా, తెలంగాణ ప్రాంతంలోని సెటిలర్లు ఇటు కాంగ్రెస్‌ను గాని, అటు టీఆర్ఎస్‌ను గాని విశ్వసించలేదని, టీడీపీ వైపు మొగ్గు చూపారని.. ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న బీజేపీకి ఓట్లు వేశారని పొన్నాల వివరించనున్నట్లు సమాచారం. అదే విధంగా వైసీపీ, టీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కారణంగానే ఖమ్మంలో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను వైసీపీ దక్కించుకుందని, ఇక సీపీఐతో పొత్తు లాభించలేదని అధిష్ఠానానికి వివరించనున్నారు. ఇదే సమయంలో ఎంఐఎంతో అవగాహనవల్ల ప్రయోజనం ఏమాత్రం లేదని పొన్నాల నివేదికలో పేర్కొననున్నారని సమాచారం. తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్ ఓటమికి నేతలందరూ సమష్టి బాధ్యతను వహించాల్సి ఉంటుందని వివరించనున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన 'రెడ్డి' సామాజిక వర్గానికి తగినంత ప్రాధాన్యం దక్కలేదన్న అభిప్రాయం కూడా పార్టీకి నష్టం చేకూర్చిందని నివేదికలో పేర్కొననున్నారని పార్టీ వర్గాలు వివరించాయి.

# యాభై ఏళ్ల వాన

## కొప్పర్తి

### కవితా సంకలనం




వెల : 60/-

**చిరునామా :**

కొప్పర్తి వెంకట రమణమూర్తి
35-56-5 మాంటిస్సోరి స్కూల్ దగ్గర
తణుకు, ప.గో జిల్లా - 534 211
ఫోన్ : 08819 224632
సెల్ : 98495 25765
kopparthyvrm@gmail.com

ఆధునిక కాలంలో కొప్పర్తి ఉత్తమశ్రేణి కవి. కొప్పర్తిది ఒక విలక్షణమైన దృక్పథం. చూపు ఒక వినూత్నకోణం. మానవీయ విలువలకు నిలువెత్తు దర్పణం ఆయన కవిత్వం. యాభైఏళ్ల వాన సంకలనం నుండి మచ్చుకు ఈ కవిత.

# కెమిస్ట్రీ ఆఫ్ టియర్స్

అవును
రక్తం కన్నా కన్నీళ్లే గొప్పవి
బ్లడ్ ఈజ్ థిక్కర్ దేన్ వాటర్
నిజమే కావచ్చు
బట్ నాట్ థిక్కర్ దేన్ టియర్స్

సూది గుచ్చుకున్నపుడు, బ్లేడు కోసుకున్నపుడు
రక్తం ఉబుకుతుంది
రక్తం ఉరలుతుంది
కత్తివేటుకు ఉవ్వెత్తున లేచి పడుతుంది
రక్తం కళ్ల చూడాలంటే
రాయి కర్ర సూది బ్లేడు కత్తి బుల్లెట్
ఏదో ఒకటి ప్రయోగింపబడాలి

అందరి రక్తం ఎర్రగానే ఉండడంతో
అందరూ ఒకటేనని ఒకప్పుడు చెప్పేవాళ్లు
నిజమే రక్తం మనందరినీ ఒకటి చేసింది
ఒకే గొడుకు కిందకు తెచ్చింది

అందరిలోనూ ఒకే రక్తం ప్రవహిస్తోంది
ఎవర్ని కొట్టినా అదే రక్తం ప్రసరిస్తోంది
అమాయకుణ్ణి గుచ్చినా అదే రక్తం
నియంత్రను నరికినా అదే రక్తం

తెల్లవాణ్ణి నల్లవాణ్ణి
డబ్బులున్న వాణ్ణి లేనివాణ్ణి
మంచివాణ్ణి చెడ్డవాణ్ణి
ఎవర్ని ఎవర్ని నరికినా అదే రక్తం చిందుతున్నప్పుడు
మనిషికి రక్తం అస్తిత్వాన్నిస్తున్నట్టు అవుతున్నదే కానీ
మనిషితనానికి చిరునామా అవుతున్నదా

మంచి రక్తం చెడు రక్తం అంటూ ఉంటాయి కానీ
మహా మనిషి రక్తం మామూలు మనిషి రక్తం
అంటూ ఉంటాయా

అందుకే
రక్తం కన్నా కన్నీళ్లే గొప్పవి

లోలోపలి మనిషితనానికి
బాహ్యరూపం కన్నీళ్లు
అరడుగుల మనిషికి ప్రాగ్రూపం కన్నీళ్లు

తెలుసా
మనిషిలో కన్నీళ్ల రహస్య తటాకాలున్నాయి
నదీమూలాల్లాంటి కన్నీటి చెలమలున్నాయి
ఒకరు రాయి విసరనక్కరలేదు
మరొకరు కత్తి దూయనక్కరలేదు
గాయపరచేదైనా అనునయించేదైనా
చిన్నమాట చాలు
కళ్ల దోనెల్లో నీళ్లు కదలాడుతాయి

చదువుతున్న పుస్తకంలో చిన్న సందర్భం చాలు, కన్నీళ్లకి
చూస్తున్న తెర మీద ఒక్క సన్నివేశం చాలు, కన్నీళ్లకి
కిటికీలోంచి కనిపించే ఒక జీవిత శకలం చాలు, కన్నీళ్లకి
జీవితంలో ముంచి తీసిన కవిత్వ చరణం చాలు, కన్నీళ్లకి
నిజానికి ఇవి కూడా అక్కరలేదు
ఒక ఊహ
వణికించి తొణికించే ఒక ఊహ చాలు, కన్నీళ్లకి

గుండె బరువెక్కి
ఒక దుఃఖపు గుటక గొంతును పట్టేసి
కన్నీళ్లు తొణికిసలాడాయా, నువ్వు మనిషివి

కళ్లు వర్షించినపుడు
మనిషి నల్లమబ్బుల ఆకాశం
కళ్లల్లోకి నీళ్లు తోడుకున్నపుడు
మనిషి జలవనరులున్న సస్యక్షేత్రం
మనలోంచి మనం తవ్వుకునే
తెల్లటి మణులు కన్నీళ్లు

రక్తంలా కన్నీళ్లు అనుక్షణం తయారుకావు
రక్తంలా కన్నీళ్లు అణువణువూ ప్రవహించవు
మనిషికి ఇన్ని కన్నీళ్లుంటాయనీ
ఉండాలని ఎవరు చెప్పగలరు
రక్తం చిందడానికి భౌతికచర్య సరిపోతుంది
కళ్లు చిప్పిల్లాలంటే
రసాయనిక చర్య జరగాల్సిందే

మనుషులందర్నీ ఒకటిగా కలిపిన రక్తం
కణసముదాయాలుగా విడిపోయింది
పాజిటివ్‌గా నెగిటివ్‌గా పాలిపోయింది
కన్నీళ్లు మాత్రం వర్షపునీళ్లలా
స్వచ్ఛంగా ఉండిపోయాయి

యుద్ధ బీభత్స ప్రతీక - రక్తం
యుద్ధ విధ్వంస స్మృతి - కన్నీళ్లు
యుద్ధంలో రక్తం గడ్డకట్టుకుపోతుంది
స్మృతుల్లో కన్నీళ్లు ప్రవిస్తూనే ఉంటాయి

హృదయం రక్తంలో తేలుతూ ఉంటుంది కానీ
దాని ఉనికిని చాటేది కన్నీళ్లే

రక్తహీనత ఉన్నట్టే
దుఃఖలేమి కూడా ఉంటుంది
రక్తాన్ని ఎక్కించగలరు కానీ
కన్నీళ్ల నెవరైన ఎక్కించగలరా

▲

# నేటి నినాదం 'పర్యావరణం'

- డా॥ గంటా జలంధర్ రెడ్డి, 98482 92715

పర్యావరణం పరిరక్షణలో మన పాత్ర' అన్న అంశం మీద పత్రికా ప్రకటన ద్వారా వ్యాసాలను కోరగానే, ప్రజాజీవితంలో అన్ని రంగాలలో కృషి చేసినవాళ్ళ నుంచి విశేష స్పందన లభించింది. పర్యావరణ అన్నది ఇటీవల కాలంలో విశేష ప్రాముఖ్యం సంతరించుకున్న అంశం. ముఖ్యంగా మన దైనందిన ఆరోగ్యంతో ముడిపడ్డ అంశం. అంతేకాదు వ్యక్తికీ, సమాజానికి కూడా అనుసంధానమైన అంశం.




అధిక జనాభా, శుభ్రమైన గాలి, నీరు, ఆహారం అందుబాటులో లేని దుర్భర పరిస్థితులు, సామాన్య ప్రజలలోని అవిద్య, అజ్ఞానం వంటి వాటి వల్ల రోజు రోజుకు పర్యావరణ సమస్యలు పెరిగిపోతున్నాయి. ఈ దశలో మనం జాగ్రత్తపడకపోతే మన జీవితాలు సమస్యల వలయంలో చిక్కుకుంటాయి. కృత్రిమమైన జీవితాన్ని జీవిస్తున్న మనం ప్రకృతికి దగ్గరగా వెళ్ళినప్పుడే ఈ సమస్యలు పరిష్కార మవుతాయి. సుఖవంతమైన జీవితానికి దగ్గరి తోవలు ఎన్నో ఉంటాయి. ఈ దగ్గరి తోవ మృత్యువుకు కూడా దారి తీస్తుంది. అందుకే కొంత వ్యాయామం, కొంత పర్యావరణ స్పృహ, మరికొంత సహకారంతో కూడిన సాంఘిక జీవితం మనల్ని ఆరోగ్యానికి చేరువ చేస్తుంది.

మన వ్యాసకర్తలు పర్యావరణ పరిరక్షణ పచ్చదనంతో కూడిన పరిసరాల కోసం అనేక సూచనలు చేస్తూ వచ్చారు. వీటిల్లో కొన్ని...

1) రసాయనిక ఎరువులను నిషేధించి, సేంద్రియ ఎరువులను ప్రోత్సహించాలి.
2. పెద్ద ఎత్తున మొక్కలు నాటి చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలి.
3) వ్యక్తిగతమైన రవాణా సౌకర్యాలను వదిలేసి, సామూహిక రవాణా సౌకర్యాలను వినియోగించాలి
4. పర్యావరణ పరిరక్షణ- అన్నది చిన్న తరగతుల నుంచే పాఠశాలల సిలబస్‌లో భాగం కావాలి.
5) ఆలోపతి వైద్య విధానం జాగాలో ప్రకృతివైద్య విధానాన్ని, ఆయుర్వేద వైద్య విధానాన్ని అవలంభించాలి.
6) పర్యావరణ విజ్ఞానాన్ని అందించే అన్ని దినోత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహించి జనంలో చైతన్యాన్ని పెంచాలి.

పై అంశాలన్నీ మొక్కుబడిగా కాక అంకితభావంతో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి, ప్రభుత్వ తోడ్పాటుతో కార్యక్రమాలను నిర్వహించాలి.

చాలా సందర్భాలలో మన శాస్త్రవేత్తలు, నాయకులు అణు, జల, థర్మల్ విద్యుత్తు వంటి వాటికి ప్రత్యామ్నయంగా సోలార్ విద్యుత్తును ప్రోత్సహించాలని చెప్తున్నారు. కాని ఈ రంగంలో జరగవలసిన పరిశోధనలు సమగ్రంగా లేకపోవటంవల్ల ప్రజలకు సోలార్ విద్యుత్తు మీద నమ్మకం కలుగలేదు. ఈ విషయమై విశేషంగా కృషి జరిగితే తక్కువ ధరకు సామాన్యులకు సహజ విద్యుత్తు లభించే అవకాశం ఉంది. దీంతో పర్యావరణ ముప్పు కూడా తొలగిపోతుంది. ఒక దశాబ్దం క్రితం వరకు గోబర్ గ్యాస్ ప్లాంట్‌లు కూడా గ్రామీణ ప్రాంతాలలో ఉండేవి. కొంత పాడి ఉన్నవారికి ఇది సదుపాయంగా ఉండేది. కాని ఏ కారణంగానో అవి ఇప్పుడు మూలకు పడ్డాయి. మన అధికారుల దగ్గర మొక్కుబడి ప్రణాళికలకు కొదువ లేదు. కాని ఆచరణాత్మక వైఖరి మాత్రం లేదు. దీంతో కాగితాల మీద ఉన్న మంచి విషయాలు సమాజంలోకి రావటం లేదు. "ఒక సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక" అన్నాడు కాళోజీ. అట్లా ఒక వేపచెట్టు నుంచి వీచే గాలి పది ఎయిర్ కండిషనర్లతో సమానం అంటున్నారు. పర్యావరణవేత్తలు.

ఈ విషయంలో వేదికల మీద ఉపన్యాసాలతో సరిపెట్టకుండా, సమాజాన్ని చైతన్యవంతం చేయటానికే 'కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్' అనే సంస్థ హైదరాబాదు కేంద్రంగా తేదీ: 22-04-2010 నుండి 'వరల్డ్ ఎర్త్ డే' (ధరిత్రీ దినోత్సవం) నుండి ప్రారంభమైంది. సంస్థ చేపట్టిన అనేక కార్యక్రమాలలో పాల్గొన్న పర్యావరణవేత్తలకు, రచయితలకు, ప్రజలకు మా హృదయపూర్వక ధన్యవాదాలు. ▲

## పర్యావరణ ప్రాణప్రదం

వ్యాస కదంబం

చిరునామా:

కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్
1448, రోడ్ నం. 12,
బంజారాహిల్స్, హైదరాబాద్ - 34

వెల : 100/-



పాపికొండల దృశ్యాలు



© www.yugandroid.in

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on June 1st , 2014




To,

Book-Post

PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times

8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad